వైద్య సేవల్లో లోపాలా..

☛ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలా ☛ రేపు డయల్ యువర్ డీఎంహెచ్‌వో



ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా? వైద్యులు, సిబ్బంది సక్రమంగా పని చేస్తున్నారా, మన్యం ప్రాంతాల్లో జ్వరాల తీవ్రత.. వాటి కట్టడికి తీసుకుంటున్న చర్యలు, వైద్య శిబిరాల నిర్వహణ, వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు తగ్గించేందుకు సిబ్బంది సక్రమంగా పని చేస్తున్నారా, ఫీవర్ సర్వే చేస్తున్నారా, ఫ్రైడే డ్రై డే కార్యక్రమాల్లో పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా, డెంగీ జ్వరాలు ఎక్కువగా నమోదైన నేపథ్యంలో కట్టడికి వైద్య ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు సక్రమంగా అందుతున్నాయా సరిపడా ఉన్నాయా, రక్త పరీక్షలు సరిగా చేస్తున్నారా? ఇంకా ఏవైనా సమస్యలున్నాయా.. వీటన్నింటిపై నేరుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి శర్మిష్ఠ దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే.

తేదీ 08.10.2024, మంగళవారం
సమయం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య
చరవాణి సంఖ్య 99496 23985


లలితాత్రిపుర సుందరీదేవిగా రాట్నాలమ్మ



సత్రంపాడు: అంబికాదేవి


జంగారెడ్డిగూడెం: గంగానమ్మ

దేవీ శాంభవి.. దీన బాంధవి..

న్యూస్‌టుడే బృందం: జిల్లాలోని దేవీ క్షేత్రాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఏలూరు, రాట్నాలకుంట, ద్వారకా తిరుమల, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో ఆదివారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు.

పెరిగిన విద్యుత్తు వినియోగం



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గడచిన ఆరు రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలు, ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్తు వినియోగం బాగా పెరిగింది. గత నెలలో వినియోగం రోజుకు సుమారు 18 మిలియన్ యూనిట్లు ఉండేది. వాతావరణంలో మార్పుల కారణంగా ఎండల వేడి, విపరీతమైన ఉక్కబోతతో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు నమోదవుతున్నాయి. దీంతో వేడిని తట్టుకోలేక ప్రజలు అల్లాడుతున్నారు.

ఏసీలు, కూలర్ల వినియోగం ఒక్కసారిగా పెరిగింది. పగలు, రాత్రుళ్లు కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. దీంతో విద్యుత్తు వినియోగం ఒక్కసారిగా 20 మిలియన్ యూనిట్లకు చేరింది. గత నాలుగు రోజులుగా 19 నుంచి 20 మిలియన్ యూనిట్లకు వినియోగం పెరిగింది. శని, ఆదివారాల్లో ఇది 20.645 మిలియన్ యూనిట్లు. జంగారెడ్డిగూడెం డివిజన్‌లోనే 2 లక్షల యూనిట్ల వినియోగం జరుగుతోంది. అయిదు రోజులకు ముందు ఇక్కడ 1.8 మిలియన్ యూనిట్లు వినియోగం ఉంటే అది 2 మిలియన్‌లకు చేరింది. ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 26 లక్షల యూనిట్లు అధిక వినియోగం జరుగుతోందని ఎస్ఈ సాల్మన్ రాజు పేర్కొన్నారు. డిమాండుకు తగిన సరఫరా ఉండటం వల్ల జిల్లా పరిధిలో ఎక్కడ ఇబ్బంది లేదని చెప్పారు.

గుబ్బలమంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రులు, ఆదివారం కావడంతో బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బలమంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు.

అద్దెలు వద్దు.. ముడుపులే ముద్దు..!


దుకాణాల మాటున దోపిడీ | నగరపాలికలో పేరుకుపోయిన బకాయిలు | ఏళ్లు గడుస్తున్నా వసూలు చేయని వైనం

☛ గజ్జలవారి చెరువు బుద్ధపార్క్ సమీపంలోని కాంప్లెక్స్‌లో 48 దుకాణాలున్నాయి. వీటి నుంచి ఏడాదికి రూ.12.31 లక్షల వరకు అద్దె వసూలు చేయాలి. రెవెన్యూ సిబ్బంది పట్టించుకోకపోవటంతో రూ.44.7 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. అంటే నాలుగేళ్లుగా ఈ దుకాణాల నుంచి అసలు అద్దె వసూలు చేయలేదు.

☛ చోడిదిబ్బలో 3 దుకాణాలున్నాయి. వీటికి ఏడాదికి రూ.90 వేలు అద్దె వస్తుంది. అయిదేళ్ల నుంచి అధికారులు ఆ వైపు కూడా చూడలేదు. దీంతో రూ.4.9 లక్షల బకాయిలు ఉన్నాయి. ఇలాంటి దుకాణాలు నగరపాలికలో వందల సంఖ్యలో ఉన్నాయి.


ఈనాడు, ఏలూరు:

ఏలూరు నగరపాలిక పరిధిలో దుకాణాల మాటున దోపిడీ జరుగుతోంది. ఏళ్ల నుంచి దుకాణాలకు బకాయిలు పేరుకుపోయినా పట్టించుకోవడం లేదు. సొమ్ములు వసూలు చేయరు..దుకాణాలను ఖాళీ చేయకుండా కథ నడిపిస్తున్నారు. దుకాణదారుల్లో ఎక్కువ మంది వైకాపా అనుచరులు కావడంతో గత అయిదేళ్లుగా అధికారులు వసూళ్లను పట్టించుకోలేదు. దీంతో నగరపాలికకు జమ కావాల్సిన రూ.కోట్ల ఆదాయానికి గండి పడుతోంది.



ఏలూరు నగరపాలిక సంస్థకు ఏడాదికి దాదాపు రూ.4 కోట్ల వరకు దుకాణాల నుంచి ఆదాయం రావాలి. క్షేత్రస్థాయిలో అధికారులు అద్దె వసూళ్లను గాలికొదిలేశారు. ప్రతి నెల 5వ తేదీ లోగా రెవెన్యూ అధికారులు అద్దె వసూళ్లు పూర్తి చేయాలి. కానీ చాలా మంది దుకాణదారులు ఏళ్లు గడుస్తున్నా అద్దె చెల్లించడం లేదు. అయినా అధికారులు ఎవ్వరికీ నోటీసులు ఇవ్వటం లేదు. దుకాణాలు ఖాళీ చేయించడం లేదు. అపరాధ రుసుం ఊసేలేదు. దుకాణదారులు నెలవారి అద్దెకు బదులు అధికారులకు నెలవారీ మామూళ్లు ఇచ్చి నోరు మూయిస్తున్నారు. దుకాణదారుల్లో 70 శాతం వైకాపా అనుచరులే కావడంతో గత అయిదేళ్లుగా కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో ఏళ్లు నుంచి రూ.కోట్ల బకాయిలు పేరుకు పోయాయి.

పూర్తిగా గాడి తప్పింది.. వైకాపా పాలనలో నగరపాలిక పూర్తిగా గాడి తప్పింది. దుకాణాలు మూడేళ్ల కాలానికి ఒప్పంద రిజిస్ట్రేషన్ చేయించాలి. ఇలా చేస్తే సర్‌ఛార్జీలో 90శాతం నగరపాలక సంస్థకు ఆదాయంగా సమకూరుతోంది. కానీ రిజిస్ట్రేషన్లు చేయించకుండానే దుకాణాలు కట్టబెట్టేస్తున్నారు. 5వ తేదీ గడువు దాటితే నూటికి రూ.2 చొప్పున అపరాధ రుసుం వసూలు చేయాలి. ఇక్కడ ఏళ్లుగా బకాయిలున్నా ఆ ప్రస్తావనే లేదు. మూడేళ్లకోసారి వేలం నిర్వహించి దుకాణాలు కేటాయించాలి..ఒప్పందాలు పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఇవేమీ జరగడం లేదు. ఈ విషయమై కమిషనర్ భానుప్రతాప్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



745	నగరపాలికలో మొత్తం దుకాణాలు
అద్దెకు ఇచ్చినవి	607

■ వసూలు చేసిన మొత్తం
■ పేరుకుపోయిన బకాయిలు

చేదు జ్ఞాపకానికి ఆనవాళ్లు..!





కప్పుటి తీపి జ్ఞాపకాలు, చేదు అనుభవాలకు గుర్తులుగా కొన్ని ఆనవాళ్లు నిలుస్తుంటాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం చినమైనవానిలంక సముద్ర తీరంలో శిథిల తుపాను భవనం ఇలాంటి కోవలోదే. జిల్లాలోని సముద్ర తీరం వెంబడి చినమైనవానిలంక, బియ్యపుతిప్ప గ్రామాలు ఉండేవి. వీటిలో సుమారు అయిదువేల మంది నివసించేవారు. 2004 డిసెంబరు 26న సంభవించిన సునామీ కారణంగా చినమైనవానిలంక, బియ్యపుతిప్పలు కడలి గర్భంలో కలిసిపోయాయి. దీంతో ఇక్కడి ప్రజలంతా 2 కి.మీ. దూరంగా వెళ్లి అవే పేర్లతో కొత్తగా గ్రామాలను ఏర్పాటు చేసుకున్నారు. కొన్నేళ్లు గడిచిన తర్వాత చినమైనవానిలంకలో అలనాటి తుపాను రక్షిత భవనం, రామాలయం, వంతెనలు కొంతమేర సముద్రం నుంచి బయటపడ్డాయి. అనంతరం సముద్ర అలల దిశ మారడం, సముద్రం కొంతమేర వెనక్కి మళ్లడంతో తుపాను రక్షిత భవనం పూర్తిగా కనిపిస్తోంది. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు దీనిని ఆసక్తిగా తిలకిస్తూ ఆనాటి స్థానికుల అనుభవాలను తెలుసుకుంటున్నారు.

- ఈనాడు, నరసాపురం

మద్యం దుకాణాలకు 695 దరఖాస్తులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాలకు సంబంధించి ఆదివారం ఒక్క రోజే 215 దరఖాస్తులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటి వరకు వీటి సంఖ్య 695కు చేరింది. గడువు రెండురోజులే ఉండటంతో ఆశావహులు సోమ, మంగళవారాల్లో ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు అందజేస్తారని భావిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఎన్ని నమోదవుతున్నాయో స్పష్టంగా తెలియడం లేదని ఎక్సైజ్ అధికారుల్లో చర్చ నడుస్తోంది. కొత్త నిబంధనల ప్రకారం దేశంలో ఎక్కడి నుంచైనా షెడ్యూలు బ్యాంకుల్లో తీసిన డీడీలను అనుమతిస్తూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. జిల్లా కార్యాలయాలకు లాగిన్ అనుమతి ఇవ్వకపోవటంతో ఏ జిల్లాకు ఎన్ని దరఖాస్తులు ఆన్‌లైన్లో వచ్చాయో తెలియడంలేదు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి వినతి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్ కోరారు. ఈ మేరకు మంత్రి అచ్చెన్నాయుడుకు ఆదివారం విశాఖపట్నంలో వినతి పత్రం అందజేసినట్లు ఎంపీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. తెదేపా హయాంలో ఆక్వా రైతులకు విద్యుత్తును రాయితీపై యూనిట్ రూ.1.50 ఇచ్చారని, వైకాపా హయాంలో 10 ఎకరాల కంటే తక్కువ సాగు చేసిన వారికే దీన్ని అమలు చేశారన్నారు. ఆక్వా రైతులందరికీ విద్యుత్తు రాయితీని పునరుద్ధరించాలని కోరారు.

'టెట్'కు 84 మంది గైర్హాజరు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏలూరులోని పరీక్ష కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్షల (టెట్)కు 84 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 256 మందికి 204 మంది, మధ్యాహ్నం పరీక్షకు 286 మందికి 254 మంది హాజరయ్యారని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు.

ఆర్టీసీకి దసరా తాకిడి

హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీకి దసరా పండగ తాకిడి నెలకొంది. ఈ నెల 12న విజయదశమి పర్వదినం కావడంతో హైదరాబాద్ నుంచి ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నారు. ఇప్పటికే పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పండగ రోజుల్లో బంధువుల ఇళ్ల వద్ద గడిపేందుకు పిల్లలు సహా తల్లిదండ్రులు స్వగ్రామాలకు చేరుకున్నారు. దసరా సందర్భంగా విజయవాడలోని కనకదుర్గమ్మ వారిని దర్శించుకునే వారు ఎక్కువగా ఉంటున్నారు. వారికోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతోంది. ఈ నెల 2 నుంచి హైదరాబాద్ నుంచి ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు డీపీటీవో వరప్రసాద్ తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు మొత్తం 80 ప్రత్యేక బస్సులను నడిపేలా ప్రణాళిక రూపొందించారు. ఈ నెల 8, 9, 10, 11 తేదీల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే బస్సులకు డిమాండ్ నెలకొంది. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా ఈ బస్సుల్లో టికెట్లు ఫుల్ అయ్యాయి. తిరుగు ప్రయాణం నిమిత్తం ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి హైదరాబాద్‌కు 20 ప్రత్యేక బస్సులు నడపనున్నారు.


టికెట్ల కోసం వరుసలో నిల్చున్న ప్రయాణికులు



విజయవాడకు.. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి విజయవాడకు ఈ నెల 8, 9, 10, 11 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడపనున్నారు. రోజుకు 20 బస్సులను అదనంగా నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని డీపీటీవో వరప్రసాద్ తెలిపారు. ఆ బస్సుల్లో ప్రయాణానికి అదనపు రుసుము చెల్లించనవసరం లేదు. పండగ రోజుల్లో ప్రత్యేక బస్సులు నడిపేలా షెడ్యూలు రూపొందించినప్పటికీ సాధారణ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అదనపు బస్సులను వినియోగించనున్నామని డీపీటీవో తెలిపారు.



ప్రత్యేక రైళ్లు.. దసరా పండగను పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. కాకినాడ నుంచి సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు ఈ నెల 7న ప్రత్యేక రైలు నడుపుతున్నారని ఏలూరు రైల్వే స్టేషన్ ఇన్‌ఛార్జి రమేశ్ తెలిపారు. విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పొందూరు మీదుగా శ్రీకాకుళం రోడ్డు వరకు ప్రత్యేక రైలును ఈ నెల 7, 8, 9 తేదీల్లో నడపనున్నారని వివరించారు.

అరటి రైతును దోచేస్తున్న దళారి


జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డులో గెలల వేలం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం అరటి మార్కెట్‌లో గెలలు అమ్మే రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు. కష్టపడి పండించిన పంటకు రవాణా, కూలీ ఖర్చులు కూడా దక్కడం లేదు. దసరా సీజన్ కావడంతో మంచి ధరలు వస్తాయని ఆశతో వస్తే టోకు వర్తకుల గుత్తాధిపత్యం కొనసాగుతోందని రైతులు వాపోతున్నారు. ఏ మాత్రం ఎక్కువ గెలలు మార్కెట్‌కు వచ్చినా ధరలు అమాంతం పడిపోతున్నాయి. పెద్ద గెలలకు సైతం రూ.200కు మించి మార్కెట్ ఉండటం లేదు. చిన్న గెలలకైతే రూ.20 ఇవ్వడానికి వ్యాపారులు ఇష్టపడటం లేదని రైతులు గగ్గోలు పెట్టారు.





ఇక్కడి మార్కెట్‌లో మోసపోతున్నాం.. మార్కెట్‌కు 47 గెలలు తెస్తే రూ.4,600 వచ్చింది. ఒక్కో దానికి రూ.100 కూడా పడలేదంటూ బయ్యనగూడెం గ్రామ రైతు నరసారపు బాలకృష్ణ తీవ్ర ఆవేదన చెందారు. ఇందులో ఆటో, కోత ఖర్చులే రూ.1,800. ఇక్కడి మార్కెట్‌లో దారుణంగా మోసపోతున్నాం. నేను తెచ్చిన గెలల్లో బాగా పెద్దవాటికి రూ.210 వచ్చింది. ఇవి మార్కెట్‌లో రూ.1,000 పైనే ఉంటాయి. ఒక మనిషి వీటిని మోయలేరు. దసరా పండగ సమయంలోను వ్యాపారులు కనికరం చూపలేదు.

'ఈ అరటి గెలలను గతి లేక రూ.19 చొప్పున అమ్మా. ఒక రూపాయి పెంచి రూ.20 ఇవ్వమని అడిగినా వ్యాపారులు ఇష్టపడలేదు. ఈ ధరకు తెచ్చిన 70 గెలల్లో 36 అమ్మా. బాగా పెద్ద గెలలను సైతం రూ.120కి మించి కొనలేదు. గెలలు ఎక్కువ వచ్చాయని ధర బాగా తగ్గించేశారు. ఇవి తేవడానికి కిరాయి రూ.వేయి, కోత కూలి రూ.500 అయ్యింది. ఖర్చులు కూడా రాలేదని' బొర్రంపాలెం గ్రామానికి చెందిన గంగుల నాగయ్య వాపోయారు.





50 గెలలకు రూ.1,800.. మాది మైసన్నగూడెం ఈ రోజు 50 గెలలు తెస్తే సగటున ఒక్కో గెలకు రూ.36 చొప్పున రూ.1,800 వచ్చాయి. ఇందులో ఆటో ఖర్చు రూ.800. నాకు మిగిలింది కేవలం రూ.1,000 మాత్రమే. ఒక్కో గెలకు కనీసం రూ.250 అయినా వస్తుందని ఆశ పడ్డా. గెలలు ఎక్కువ వస్తే ఇక్కడ మార్కెట్‌ను పతనం చేస్తున్నారని రైతు బొడ్డు రత్నాజీ ఆవేదన చెందారు.



కొన్న ధర రాలేదు.. నేను రైతుల వద్దకు వెళ్లి అరటి గెలలు కొని జంగారెడ్డిగూడెంలో ప్రతి శనివారం జరిగే అరటి మార్కెట్‌లో వ్యాపారులకు అమ్ముతా. ఒక్కో గెల రూ.175 చొప్పున కొని ఆడమిల్లి నుంచి 70 గెలలు తెస్తే ఇక్కడ రూ.110 చొప్పున కొన్నారు. బాగా నష్టపోయా ఇంత దారుణ మార్కెట్ ఎప్పుడు లేదని ఏసుపాదం వాపోయారు.

రేషన్ బియ్యం పట్టివేత

విజిలెన్స్ అధికారుల దాడులు

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. ఇరగవరం మండలం తూర్పువిప్పర్రులో 11 క్వింటాళ్లు నిల్వ చేయగా.. దాడులు చేసి స్వాధీనం చేసుకుని సతీష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కామవరపుకోట పశువుల ఆసుపత్రి సమీపంలో ఆటోలో తరలిస్తున్న 7.5 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. ఆటో డ్రైవర్ కాట్రు వెంకటేశ్, కోడూరు కాశీ పళనికుమార్, షేక్ లాల్‌జాన్ బాషా, టి.శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేశారు. కామవరపుకోట చెక్‌పోస్టు వద్ద ఓ వ్యాన్‌లో తరలిస్తున్న 170 క్వింటాళ్లు పట్టుకొని కోనా సాయికుమార్, చోటిశెట్టి మహేశ్, చోటిశెట్టి సతీష్, సూరిబాబు, సహాయకులు జానీ, వీరబాబు, పండుపై కేసులు నమోదు చేశారు. ఏలూరు శనివారపుపేటలో ఆటోలో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వెయ్యి కిలోల బియ్యాన్ని పట్టుకున్నారు. జన్యావుల సుధాకర్‌ను అరెస్టు చేశారు. దాడుల్లో విజిలెన్సు ఎస్సై రంజిత్ కుమార్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాదివాడ సమీపాన మురికి కూపాల్లా మారిన పొలం

కొల్లేరులా.. వరి చేలు!

భారీ వర్షాలు, కొల్లేరు వరద ప్రభావంతో ఆకివీడు మండల పరిధిలో 2,100 ఎకరాల్లో వరిచేలు పూర్తిగా ముంపుబారిన పడ్డాయి. దాదాపు నెల రోజులు గడిచినా ఆకివీడు, మాదివాడ, అయిభీమవరం, మందపాడు, దుంపగడప, చినమిల్లిపాడు తదితర గ్రామాల్లో అధికశాతం చేలు ఇప్పటికీ ముంపు నుంచి తేరుకోలేదు. వాటిలో తూడు, నాచు పెరిగి కొల్లేరును తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే కలువపూలు సైతం వికసించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వీటిని తొలగించి మళ్లీ సాగుకు సన్నద్ధం కావడం తలకు మించిన భారమేనని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఆకివీడు**

ఇసుక కష్టాలకు త్వరలోనే తెర!

● అనుమతులు రాగానే పూర్తిస్థాయి సరఫరా ● 'న్యూస్‌టుడే'తో గనుల శాఖ సహాయ సంచాలకుడు రవిప్రసాద్

భీమవరం టూటౌన్, ఆచంట, న్యూస్‌టుడే: గోదావరి పరివాహక ప్రాంతాన్ని కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జడ్)లో చేర్చడం వల్ల జిల్లా పరిధిలో ఇసుక తవ్వకాలకు అనుమతుల జారీలో జాప్యం జరుగుతుందని.. ఈ సమస్యను అధిగమించి వీలైనంత త్వరగా అన్ని రీచ్‌లలో తవ్వకాలు చేపట్టి ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టామని గనుల శాఖ జిల్లా సహాయ సంచాలకుడు రవి ప్రసాద్ తెలిపారు. ఇటీవల జిల్లాలో బాధ్యతలు చేపట్టిన ఆయన పలు అంశాలపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వివరాలు ఇలా..

కేంద్రం పరిధిలో.. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఆరు ఓపెన్, అయిదు బోట్‌మ్యాన్ రీచ్‌లు ఉన్నాయి. వీటిలో ఆచంట మండలం కరుగోరుమిల్లి ఓపెన్ రీచ్‌కు మాత్రమే పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు ఉన్నాయి. పెనుగొండ మండలంలో సిద్ధాంతం-1, నడిపూడి-1, నడిపూడి-2 రీచ్‌లకు కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు రావాల్సి ఉంది. సిద్ధాంతం-2, కోడేరు రీచ్‌లకు ఎలాంటి అనుమతులు రాలేదు. బోట్‌మ్యాన్ రీచ్‌లన్నింటికీ కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు రావాలి. ఈ ప్రక్రియ కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంటుంది. వీలైనంత త్వరగా అనుమతులు వచ్చేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. అనుమతులు రాగానే తవ్వకాలు చేపట్టి సామాన్యులకు ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తాం.



ఆన్‌లైన్‌లోనే బుకింగ్.. సాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో 24 గంటలూ ఇసుక కోసం నమోదు చేసుకోవచ్చు. స్టాకు యార్డుల వారీగా అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలు, నాణ్యత గ్రేడ్‌లను ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. సమీప స్టాక్‌యార్డును ఎంచుకుని ఆన్‌లైన్‌లో బుకింగ్ ద్వారా ఆర్డర్ చేసుకుంటే ఇంటికే ఇసుక వస్తుంది. జిల్లాలోని స్టాకు యార్డుల్లో ప్రస్తుతం ఇసుక నిల్వలు లేకపోవడంతో తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల నుంచి సరఫరా చేస్తున్నాం. ఆన్‌లైన్ విధానంలో ఇసుక సరఫరాకు జిల్లాలో సుమారు 300 మంది లారీ యజమానులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

పట్టుబడితే జరిమానా.. పలు ప్రాంతాల్లో రాత్రి వేళ అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రత్యేక నిఘాతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. ఇలాంటి వాహనాలు పట్టుబడితే నూతన నిబంధనల ప్రకారం రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తాం. అవసరమైతే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం.

పంపుహౌస్‌నే అందమైన వనంగా మలిచి!



గార్డెన్‌లో డ్రాగన్ మొక్కలు



ఆళ్ల రమణ

పాలకోడేరు, న్యూస్‌టుడే: పంచాయతీ మంచి నీటి చెరువుల పంపు హౌస్ ప్రదేశాలు దాదాపు అన్నీ చోట్ల తుప్పలు, గడ్డితో చిట్టడవులను తలపిస్తుంటాయి. పాలకోడేరులోని మంగయ్య చెరువు గట్టుపై ఉన్న పంపుహౌస్‌ను ఒక్కసారి తిలకిస్తే ఆశ్చర్యపోవడం ఖాయం. మంచినీటి ట్యాంకు, ఫిల్టర్‌బెడ్ల కంటే అందమైన పూలమొక్కలతో కనువిందు చేసే ఉద్యానం దర్శనమిస్తోంది. లోపలికి అడుగుపెట్టగానే రకరకాల పూల మొక్కలతో పాటు పలు రకాల పండ్లు, పచ్చటి మొక్కలు స్వాగతం పలుకుతాయి. ఈ అందమైన ఉద్యానానికి ఆద్యుడు పంపుహౌస్ కాపలాదారు ఆళ్ల మురళి. మొక్కల పెంపకం అంటే మక్కువ కలిగిన ఈ వృద్ధుడు ఎనిమిదేళ్లుగా ఇక్కడ పని చేస్తూ అందమైన వనాన్ని నిర్మించి పచ్చటి మొక్కలను కాపాడుతున్నారు. నామమాత్రపు వేతనం తీసుకుంటూ సొంత ఖర్చుతో ఈ గార్డెన్ తీర్చిదిద్దారు. ఒకప్పుడు చిట్టడవిని తలపించే విధంగా ఉన్న ఈ ప్రాంతాన్ని ప్రస్తుతం ఆహ్లాదాన్ని పంచే పచ్చటి ఆవరణగా మార్చివేసిన మురళిని గ్రామస్థులతో పాటు అధికారులు, ప్రకృతి ప్రేమికుల మన్ననలు పొందుతున్నారు. విధుల నిర్వహణలోనూ సమయపాలన పాటించడం ఈయన సొంతం.



మంచినీటి పథకం వద్ద మొక్కలు

సేంద్రియ విధానంలో... గార్డెన్‌లోని పచ్చటి మొక్కలతో పాటు పండ్ల మొక్కలకు సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగిస్తున్నారు. నాలుగేళ్ల కిందట పాతిన చెరుకు గడ 40 అడుగుల పొడవుగా పెరిగింది. డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలను సేంద్రియ ఎరువులతో పెంచుతున్నారు. ఇక ఆలస్యమెందుకు ఒకసారి వెళ్లి చూసి వచ్చేద్దాం.

అమ్మవారికి టన్నున్నర సారె తయారీ

నిడమర్రు, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల సందర్భంగా మందలపర్రులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో అమ్మవారికి టన్నున్నర సారెను భక్తుల విరాళాలతో తయారు చేస్తున్నారు. 11 రకాల మిఠాయిలను ఆదివారం నుంచి తయారు చేయడం ప్రారంభించారు. ఈ నెల 8న అమ్మ వారికి సారె సమర్పిస్తారు. అదే రోజు రూ.42 లక్షలతో తయారు చేయించిన బంగారు కిరీటాన్ని అమ్మవారికి అలంకరిస్తారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహిస్తామని పంచాయతన క్షేత్ర కమిటీ నిర్వాహకులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, సరిపల్లె శంకరం, కె.రామచంద్ర రాజు, పి.కృష్ణంరాజు తెలిపారు. అమ్మవారికి సమర్పించిన సారెను భక్తులకు పంచిపెడతామన్నారు.





మందలపర్రులో మిఠాయిలు తయారు చేస్తున్న మహిళలు



పోటీల్లో గెలుపొందిన ఏలూరు జిల్లా ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో జిల్లా ఉపాధ్యాయులు ప్రతిభ చాటారని సంఘం జిల్లా అధ్యక్షుడు ముస్తాఫా అలీ ఒక ప్రకటనలో తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ స్లో సైకిల్ రేస్ 46 ప్లస్ విభాగంలో ద్వితీయ, వంద మీటర్ల పరుగు 45 సంవత్సరాల్లోపు విభాగంలో పెదవేగి మండలానికి చెందిన ఉపాధ్యాయిని పద్మ జయలక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. పెదపాడు మండల ఉపాధ్యాయిని జె.సుధారాణి 400 మీటర్ల నడకలో ప్రథమ, ఎస్.పుష్పలత 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. ద్వారకాతిరుమల మండలానికి చెందిన పి.రాజేశ్వరమ్మ 400 నడక పోటీల్లో ప్రథమ, పెదవేగి మండలానికి చెందిన ఎస్.సుధారాణి, కె.రామలక్ష్మి క్యారమ్స్ డబుల్స్‌లో ద్వితీయ స్థానాలు పొందారన్నారు. టెన్నికాయిట్‌లో ఎన్.విజయశాంతి, ఎం.రామతులసి, యు.సరళ మొదటి స్థానం సాధించారన్నారు. వంద మీటర్ల పరుగులో ఉంగుటూరు మండలానికి చెందిన జి.రామారావు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వాలీబాల్‌లో పి.పద్మజయలక్ష్మి, ఎం. విజయశాంతి బృందం, క్రికెట్‌లో కుక్కునూరు మండలానికి చెందిన ఎండీ ముషబ్బర్ బృందం విజేతలుగా నిలిచినట్లు వివరించారు.

❖ ఏలూరు శాంతినగర్ 12వ రోడ్డులో నివాసముంటున్న ఓ విశ్రాంత బ్యాంకు ఉద్యోగి గత నెలలో ఇంటి తలుపులకు తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదు వెళ్లి కొద్ది రోజులు ఉన్నారు. ఈలోగా దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలోని 15 కాసుల బంగారు నగలు, 10 కేజీల వెండి వస్తువులు, కొంత నగదు దోచుకుపోయారు.

❖ 15 రోజుల క్రితం ఏలూరు ఆశ్రం కళాశాలకు చెందిన కొందరు వైద్య విద్యార్థులు మారేడుమిల్లి విహారయాత్రకు వెళ్లారు. అక్కడి జలపాతంలో దిగి స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వాగు పొంగటంతో ముగ్గురు కొట్టుకుపోయి మృతి చెందారు. వారిలో ఒకరి మృతదేహం ఇప్పటికీ దొరకలేదు.

❖ గత వారం సత్రంపాడులోని ఓ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా టీవీ, ఫ్రిజ్, కాలిపోయాయి. ఇంటి యజమానులు ఊరెళ్లిన సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ఈ నష్టం జరిగింది.

సరదాలు.. సరదాలుగానే మిగలాలి

దసరా సెలవుల్లో జాగ్రత్తలు

కాకూడదు విషాదాలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సరదాలు సరదాలుగానే మిగిలిపోవాలి. విషాదాలుగా మారకూడదు.. అలా ఉండాలి అంటే కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిందే. ప్రస్తుతం దసరా సెలవుల నేపథ్యంలో విహార యాత్రలకు, స్నేహితులతో షికార్లకు వెళ్లేటప్పుడు.. ఇల్లు వదిలి ఊరెళ్తున్నా.. అన్నింటా అప్రమత్తత అవసరం.

ఊరు వెళితే..



● ఊరెళ్లే వారం, 10 రోజులు ఉండాల్సి వస్తే ఇంటికి తాళం వేయకుండా బంధువులనో, కుటుంబ సభ్యులనో ఒకరిని ఉంచితే మంచిది. ● ఊరు వెళ్లిన సమయంలో తలుపు తాళం కనిపించకుండా గుమ్మం తెరతో మూయండి. ఇంట్లో ఏదో ఓ గదిలో లైటు వేసి ఉంచండి. ● పోలీసు శాఖ ఏర్పాటు చేసిన లాక్డ్‌హౌస్ మోనటరింగ్ సిస్టమ్ విధానాన్ని ఉపయోగించుకోండి. మీ దగ్గరలోని పోలీసుస్టేషన్లో తెలియజేస్తే మీ ఫోన్లో లాక్డ్‌హౌస్ మోనటరింగ్ సిస్టమ్ యాప్‌ను డౌనులోడు చేస్తారు. ఊరు వెళ్లేటప్పుడు మీ ఇంటికి పోలీసులు సీసీ కెమెరాలను అమర్చుతారు.

పరికరాలు భద్రపరుచుకోండి ఇలా..





● తాళం వేసి ఊరు వెళ్లే ముందు ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రపరుచుకోవాలి. ఏసీలు, టీవీలు, వాషింగ్ మిషన్లు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు సంబంధించిన తీగలను స్విచ్‌బోర్డు నుంచి తొలగించండి. ఫ్యూజ్‌లను తీసివేయండి. ● స్విచ్‌బోర్డుకు అనుసంధానం చేసి తీగలు ఉంటే గాలివానలు, ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు షార్ట్‌సర్క్యూట్‌కు గురై పరికరాలు కాలిపోతాయి. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

ఉరికే ఉత్సాహానికి కళ్లెం వేయండి



● బీచ్‌, పర్యాటక ప్రాంతాల్లో వెళ్లినప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలి. లోతుగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకూడదు. అక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను అడుగడుగునా గమనించాలి. ● జలపాతాలు, కొండలు, కోనల్లోకి వెళ్లేటప్పుడు మరీ జాగ్రత్తగా ఉండాలి. తల్లిదండ్రులు పిల్లలను పర్యవేక్షిస్తూ ఉండాలి. చిన్నపొరపాటు చేసినా పెద్దమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోండి: ఎస్పీ



దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ఊళ్లకు వెళ్లేవారు చోరీలు జరగకుండా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ వినియోగించుకోవాలని ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి గస్తీని ముమ్మరం చేస్తామన్నారు. ఇంటి పరిసరాల సీసీ కెమెరాల లింకులను ఏలూరు పోలీసు కంట్రోలు రూం నంబరు 8332959175కు అందించాలన్నారు. పండగల ఆఫర్లు అంటూ సైబర్ నేరగాళ్లు ప్రకటనలు చేస్తుంటారని మోసపోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు.

బాస్కెట్‌బాల్ విజేత చిత్తూరు జట్టు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: ఏలూరు ఏఎస్‌ఆర్ మైదానంలో జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం, సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఆధ్వర్యంలో టి.మోహన్‌కుమార్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సెమీ ఫైనల్, అనంతరం ఫైనల్ పోటీలు నిర్వహించారు. సెమీ ఫైనల్లో రామచంద్రపురం, విశాఖపట్నం జట్లు తలపడగా రామచంద్రపురం, చిత్తూరు, గుంటూరు జట్లు తలపడగా చిత్తూరు జట్టు గెలుపొందాయి. తుది పోరులో రామచంద్రపురం, చిత్తూరు జట్లు పోటీ పడగా చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండు, మూడు స్థానాల్లో రామచంద్రపురం, గుంటూరు, విశాఖపట్నం జట్లు నిలిచాయి. ఆయా జట్లకు నగదు బహుమతులను ఏపీ పంచాయతీరాజ్ సెక్రటరీల సంఘం కార్యదర్శి కృష్ణారావు అందజేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. తల్లి దుర్మరణం

తండ్రీ కుమార్తెల పరిస్థితి విషమం



ప్రమాదంలో ధ్వంసమైన బైకులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తల్లి మృతి చెందగా, తండ్రి, మరో కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. ముదినేపల్లి మండలం వణుదుర్రుకు చెందిన మైనాకు విజయవాడకు చెందిన కిరణ్‌తో ఆరేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. విజయవాడ నుంచి భర్త, కుమార్తెలతో మైనా వణుదుర్రులోని పుట్టింటికి రెండ్రోజుల కిందట వచ్చింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో తిరిగి ద్విచక్ర వాహనంపై విజయవాడకు బయలుదేరారు. సింగరాయపాలెం పెట్రోలు బంక్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. ప్రమాదంలో మైనా(25) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త కిరణ్, అయిదేళ్ల పెద్ద కుమార్తె, మరో ద్విచక్రవాహనంపై ఉన్న యువకుడిని 108లో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలో ఉన్న చిన్న కుమార్తె పరిస్థితి విషమంగా ఉండటంతో ఎస్సై వెంకటకుమార్, సిబ్బంది వారి వాహనంలో ముదినేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి గుడివాడ తరలించడానికి 108 కోసం ఎంత ప్రయత్నించినా అవి అందుబాటులోకి రాలేదు. చివరికి సింగరాయపాలెంలోని ఓ పరిశ్రమకు చెందిన అంబులెన్స్‌లో గుడివాడ ఆసుపత్రికి తరలించారు. మరో ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు ఉన్నట్లు సమాచారం. బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడేనికి చెందిన వారుగా స్థానికులు భావిస్తున్నారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



ఎన్నికైన సంఘ నాయకులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షునిగా మండవల్లి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నగరంలోని కొప్పుల వెలమ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సంఘం జిల్లా సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఛైర్మన్‌గా మరడాని అచ్యుతరావు, కార్యదర్శిగా కె. రంగారావు, కోశాధికారి, కార్యనిర్వాహక కార్యదర్శిగా మేకా రంగారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పీఎస్ సుధాకర్, అడపా రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా బి.సుబ్రహ్మణ్యం, గంగా చెల్లమ్మ, కార్యవర్గ సభ్యులుగా టి.సత్యవతి, టి.శివనాగరాజు ఎన్నికయ్యారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.అర్జునరావు, కార్యదర్శి శ్రీకాంత్, రామారావు, గిరిరాజు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

రగ్బీ విజేత కర్నూలు జిల్లా బాలుర జట్టు

పెదవేగి, న్యూస్‌టుడే: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో పెదవేగిలోని గురుకుల బాలుర పాఠశాల మైదానంలో అండర్-19 విభాగంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో కర్నూలు జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల నుంచి 144 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.జయరాజు ట్రోఫీలు అందజేశారు. అనంతరం జాతీయ స్థాయిలో త్వరలో జరిగే పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. పరిశీలకుడు కె.నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, పీఈటీ గురుమూర్తి, వివిధ జిల్లాల పీఈటీలు పాల్గొన్నారు.

వేంకన్న కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు జరిగే ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజ మాస తిరుకల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఆలయానికి రంగులు వేసి సుందరీకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ వైభవం తెలిసేలా క్షేత్రంలోని ప్రధాన కూడళ్లలో భారీ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ నాలుగు గోపురాలు, ప్రాకారాలకు విద్యుద్దీప అలంకరణలు చేయనున్నారు.

స్ఫూర్తితో మామిడికి మంచి రోజులు!

చాట్రాయి, న్యూస్‌టుడే

● చేతి వృత్తుల పునరుజ్జీవం కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు

చేతి వృత్తుల పునరుజ్జీవం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'స్ఫూర్తి' పథకాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలకు అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. వీటిలో రైతులను కూడా భాగస్వాములను చేస్తూ సాగుకు వెన్నుదన్నుగా నిలిచేలా చర్యలు చేపట్టారు. తొలిదశలో 11 జిల్లాలను గుర్తించారు. ఆయా జిల్లాల్లో కీలకమైన జీవనోపాధిని గుర్తించారు. ఏలూరు జిల్లాలో 'మామిడి'కి ప్రాధాన్యం ఇచ్చారు. ఒక్కో ప్రాజెక్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.5 కోట్లు మంజూరు కానున్నాయి. అందులో 90 శాతం నిధులను కేంద్రం గ్రాంట్‌గా ఇస్తుండగా.. 10 శాతం లబ్ధిదారులు లేదా రాష్ట్ర ప్రభుత్వం భరించొచ్చు. మండల, గ్రామ సమాఖ్య నిధులను కేటాయించేందుకు అవకాశముంది.

జిల్లాలో 58 వేల ఎకరాల్లో సాగు

మామిడి ఎగుమతుల్లో నూజివీడుకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. జిల్లాలో 58 వేల ఎకరాల్లో సాగు ఉన్నా.. నూజివీడు నియోజకవర్గంలోనే అత్యధికం. తర్వాత స్థానంలో చింతలపూడి నియోజకవర్గముంది. మామిడి రైతుకు ఏటా నష్టాలు తప్పడం లేదు. మామిడి ఆధారిత పరిశ్రమలకూ ప్రోత్సాహం కరవైంది. 'స్ఫూర్తి' పథకంతో మామిడి రైతులకు ఎనలేని మేలు జరగనుంది. ఉత్పత్తులను నిల్వ చేసే అవకాశాలు సైతం ప్రాజెక్టులో కల్పించారు. ఫలితంగా రైతు సాగు చేసే పంటను హడావుడిగా అమ్మకాలు చేసే పరిస్థితి ఉండదు.



నూజివీడులో ఎగుమతి చేసే బంగినపల్లి మామిడి కాయలు

వసతి ఇలా.. ప్రాజెక్టులో భాగంగా సామాజిక వసతుల కేంద్రం (కామన్ ఫెసిలిటీ సెంటర్)ను ఏర్పాటు చేస్తారు. ప్రాసెసింగ్ యూనిట్లు, సరకులు, పంట ఉత్పత్తుల నిల్వకు గోదాములను అందుబాటులోకి తీసుకొస్తారు. హైదరాబాద్‌లో జాతీయ సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమ దీనికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. వ్యాపారం, పరిచయం, లాభాలు లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. వచ్చిన ఆదాయాన్ని అందరూ పంచుకునేలా చేస్తారు.

ఏడాది పొడవునా ఉపాధి

ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మహిళా సంఘాలు క్రియాశీలకంగా ఉన్నాయి. పచ్చళ్లు, మామిడి గుజ్జు, వరుగులు, తాండ్ర, ఇతర మామిడి ఉత్పత్తులను తయారు చేస్తూ ఎగుమతి చేసే వివిధ రంగాల్లో ఇక్కడి మహిళలు పని చేస్తున్నారు. 'స్ఫూర్తి'లో జిల్లా నుంచి మామిడిని ఎంపిక చేయడంతో మహిళలకు మేలు జరగనుంది. ఏడాది పొడవునా ఉపాధి లభించేలా వసతులు కల్పించనున్నారు.



స్వయం సహాయక సంఘాల మహిళలు

మనస్తాపంతో ఆత్మహత్య

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అనారోగ్యం పాలైన ఓ వ్యక్తి తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు మండలం కోమటిలంకకు చెందిన తెనాలి సంగీతరావు (58) కూలి పనులు చేసేవాడు. ఇతనికి భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. పిల్లలకు పెళ్లిళ్లు చేశారు. పదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఇటీవల పరీక్షలు చేయించుకోగా కిడ్నీకి సంబంధించిన సమస్య ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తీవ్ర మనస్తాపానికి గురైన సంగీతరావు ఈ నెల 5న అధిక మోతాదులో మందు బిళ్లలు మింగాడు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అప్పుల బాధతో..

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన అశ్వారావుపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసు కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడానికి చెందిన రామిశెట్టి నాగేశ్వరరావు(60) ఇటీవల తన తమ్ముడి గ్రామమైన అశ్వారావుపేట మండలం ఊట్లపల్లికి వచ్చాడు. తమ్ముడితో ఈ నెల 5న జంగారెడ్డిగూడెం వెళుతున్నానని చెప్పి మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని రాఘవయ్య చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. అప్పుల బాధ తాళలేకనే చనిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

కుమార్తె మందలించడంతో తండ్రి..

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: తాగుడుకు బానిసయ్యావని కుమార్తె మందలించడంతో తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆగిరిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన డి. ధర్మారావు (47) విజయవాడలోని ప్రైవేటు ట్రావెల్స్‌లో పని చేస్తున్నారు. ఇటీవల అప్పుల బాధతో మద్యానికి బానిస అయ్యాడు. శనివారం ధర్మారావును మద్యం మానేయాలని కూతురు గట్టిగా మాట్లాడటంతో మనస్తాపం చెంది ఇంట్లో అందరూ నిద్రపోతున్న సమయంలో పంకాకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే సరికి మృతి చెందాడు.

డ్రగ్స్ ఉన్న పార్సిల్ వచ్చిందంటూ..

మహిళకు రూ.40 లక్షలకు టోకరా వేసిన సైబర్ కేటుగాళ్లు

నూజివీడు, న్యూస్‌టుడే: డ్రగ్స్ ఉన్న పార్సిల్ వచ్చిందంటూ ఓ మహిళకు సైబర్ కేటుగాళ్లు రూ.40 లక్షల టోకరా వేసిన ఘటన నూజివీడు పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నూజివీడు ఉషాబాల నగర్‌కు చెందిన మందపల్లి కమల జేసుదాసుకు ముగ్గురు సంతానం. అందరూ ఆమెకు దూరంగా నివసిస్తున్నారు. పెద్ద కుమార్తె బెంగళూరులో.. కుమారుడు, చిన్న కుమార్తె అమెరికాలో ఉంటారు. ఆమెకు ఈ నెల 2న ఒక ఫోన్ కాల్ వచ్చింది. తాము ముంబయి పోలీసు విభాగం నుంచి మాట్లాడుతున్నట్లు ఓ మహిళ తెలిపింది. మీకు ఒక పార్సిల్ వచ్చిందని దానిలో ఎండీఎంఏ, నిషేధిత డ్రగ్స్ ఉన్నాయని చెప్పారు. దానితో మీకు ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. అంతలో ఆమె మరో నంబర్ నుంచి వీడియో కాల్ చేశారు. తాను ముంబయి పోలీసు అధికారినని, మీకు డ్రగ్స్‌తో సంబంధం ఉందని భయపెట్టారు. డ్రగ్స్ ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించి కొంత నగదు డిపాజిట్ చేయాలని, విచారణలో డ్రగ్స్‌తో సంబంధం లేదని తేలితే తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికింది.. దీంతో ఆమె ఈ నెల 3న రూ.20 లక్షలు ఒకసారి, మరొక ఖాతాకు రూ. 10 లక్షలు బదిలీ చేశారు. ఈ నెల 4న మరొక ఖాతాకు రూ.10 లక్షలు ఇలా మొత్తం రూ.40 లక్షలు బదిలీ చేశారు. నగదు బదిలీ చేసిన తర్వాత నుంచి ఆమెతో మాట్లాడిన ఫోన్ నంబర్ పనిచేయడం ఆగిపోయింది. దీంతో ఆమె మోసపోయినట్లు గ్రహించి నూజివీడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నూజివీడు పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్ ఆదివారం తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.25 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

సంప్రదాయ కళల పరిరక్షణకు మేము సైతం

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: సంప్రదాయ కళల పరిరక్షణలో మేము సైతం అంటూ శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం, నాట్యగురు మేదరమెట్ల శిరీష నేతృత్వంలో మన దేవాలయం మన కూచిపూడి కార్యక్రమాన్ని దొండపాడులోని శ్రీ సం దత్తాత్రమంలో ఆదివారం నిర్వహించారు. ఏలూరులోని ప్రముఖ ఆలయాలతో పాటు దేశంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో తమ శిష్యులు నాట్య ప్రదర్శనలు ఇస్తారని శిరీష తెలిపారు. ప్రజల్లో దేవాలయాలపై భక్తి, కూచిపూడి నాట్యంపై అనురక్తిని కల్పించి సంప్రదాయ కళలను పరిరక్షించడమే కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

పెదపాడు, పెదవేగి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో సాధారణ పరిపాలన విధానాలపై ప్రతి పంచాయతీ నుంచి ఉపసర్పంచి, ఇద్దరు వార్డు సభ్యులకు ఈ నెల 8, 9 తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పెదపాడు, పెదవేగి ఎంపీడీవోలు మహమ్మద్ జమీల్ జామ, పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండల పరిషత్తు కార్యాలయాల వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని వివరించారు.

నగరంలో ఈనాడు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:
- ఉదయం 10 గంటలకు: ఏలూరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఏలూరు అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం.



పురస్కారం అందజేస్తున్న సత్యనారాయణ

సూర్యనారాయణ సేవలు ఎనలేనివి

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: గానకోకిల కుమార సూర్యనారాయణ శాస్త్రీయ నృత్య గాయకునిగా స్థిరపడి.. కూచిపూడి, భరత, ఆంధ్ర నాట్య కళాకారులకు గాత్ర సహకారం అందించి సంగీత నాట్య రంగాలకు ఎనలేని సేవలు అందిస్తున్నారని కళారత్న కె.వి.సత్యనారాయణ కొనియాడారు. కె.వి.ఎస్. ట్రస్టు, ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో కె.వి. సత్యనారాయణ సంగీత ప్రతిభ పురస్కారం-2024 ప్రదానోత్సవం ఏలూరులోని మార్కండేయ వేద పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. సూర్యనారాయణను పురస్కారంతో సత్కరించారు. నాట్యాచార్య డి.హేమసుందర్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. డి.వి.రమణ, వి.వి. హనుమంతరావు, పురుషోత్తం, కళాభిమానులు పాల్గొన్నారు.

దసరా శిక్షణ శిబిరం.. సెలవులు సద్వినియోగం

చిత్రలేఖనం, సూక్ష్మకళలు నేర్చుకున్న బాలలు



చిత్రలేఖనంపై మక్కువ.. 'చిత్రలేఖనం అంటే నాకు మక్కువ. ప్రకృతి ఉట్టిపడేలా బొమ్మలు గీయగలను. చిత్రాలు సులభంగా గీయడంలో శిక్షకులు మెలకువలు నేర్పారు. గతంలో కంటే ఇప్పుడు సులభంగా బొమ్మలు గీయగలుగుతున్నా' అని గగని తెలిపారు.



చిన్నప్పటి నుంచి అభిరుచి.. 'బొమ్మలు గీయడమంటే చిన్నప్పటి నుంచి అభిరుచి. పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించా. చిత్రలేఖనంతో పాటు అగ్గిపుల్లలు, బియ్యం గింజలపై బొమ్మలు చెక్కడం నేర్చుకున్నా' అని తరుణ్‌తేజ్ వివరించారు.

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: చిన్నారులు దసరా సెలవులను వృథా చేయకుండా సద్వినియోగం చేసుకున్నారు. చిత్రలేఖనం, సూక్ష్మకళలు నేర్చుకున్నారు. ఏలూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో దసరా శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో నిర్వహించిన శిబిరంలో 200 మంది విద్యార్థులు చిత్రలేఖనం, బియ్యం గింజలు, అగ్గిపుల్లలపై బొమ్మలు గీయడంలో శిక్షణ పొందారు. వారిలో కొందరు ఏమన్నారంటే..



శిక్షణ పొందుతున్న విద్యార్థులు



పోటీల్లో పాల్గొంటా.. 'సెలవుల్లో శిక్షణను సద్వినియోగం చేసుకున్నా. శిక్షకులు బొమ్మలు గీయడం, అగ్గిపుల్లలు, బియ్యం గింజలపై బొమ్మలు చెక్కడం నేర్పారు. శిక్షణలో నేర్చుకున్న మెలకువలతో భవిష్యత్తులో పోటీల్లో పాల్గొని బహుమతులు సాధిస్తా' అని కె.రూప తెలిపారు.



మా అక్క స్ఫూర్తి.. 'మా అక్క చక్కగా బొమ్మలు గీస్తుంది. ఆమె గీస్తున్న వాటిని చూసి నేను కూడా గీయడం ప్రారంభించా. సెలవుల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిసి శిబిరంలో చేరా. బొమ్మలు గీయడంలో మెలకువలు నేర్చుకున్నా' అని కె.దుర్గా వర్షిణి అన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు : 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: సత్రంపాడు మండావారివీధిలో నివాసాల ముందున్న కాలువలో మురుగు నీరు పారడం లేదు. రాత్రివేళ దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. **- వి.వెంకటస్వామి, స్థానికుడు**

సమాధానం: కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- జి.చంద్రయ్య, నగర పాలక సహాయాధికారి**

సమస్య: ఏలూరు ఆర్. ఆర్. పేట శ్రీనివాస థియేటర్ రోడ్డులోని ప్రధాన కాలువలో మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. **- రమణారావు, పవరుపేట**

సమాధానం: సిబ్బందితో మురుగు కాలువలో పూడిక తీయిస్తాం. **- కంభంపాటి స్టీఫెన్‌రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: కొత్తూరు రాజీవ్‌గృహ కల్పకాలనీ ఏడో రోడ్డులోని కాలువలో మురుగు పారడం లేదు. దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. **- జి.సందీప్‌కుమార్, రాజీవ్ గృహకల్ప కాలనీ**

సమాధానం: సిబ్బందితో మురుగు కాలువలో పూడిక తీయిస్తాం. **- భానుప్రతాప్, నగర పాలక అధికారి**

దోమల మందు పిచికారీ

స్పందనకు వందనం

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: సత్రంపాడు ఆర్టీసీ ఎంప్లాయీస్ కాలనీ ప్రధాన రోడ్డులోని కాలువలో పూడిక తీసి దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సమస్యపై 3న ప్రచురితమైన వార్తకు నగర పాలక సహాయాధికారి జి. చంద్రయ్య స్పందించి సిబ్బందితో పనులు చేయించారు.

పూడిక తీశారు.. ఫిల్‌హౌస్‌పేట ఏడు కాలువల కూడలి వద్ద మురుగు కాలువల్లో పూడిక తీశారు. కాలువలను నెలలుగా శుభ్రం చేయడం లేదని ఈ నెల 3న ప్రచురితమైన వార్తకు నగర పాలక ఉప అధికారి శివారెడ్డి స్పందించి సిబ్బందితో పనులు చేయించారు.

లలితాత్రిపురసుందరీ నమోస్తుతే

ఏలూరు గ్రామీణ, పెదవేగి, పెదపాడు, భీమడోలు, ఉంగుటూరు, గణపవరం, నిడమర్రు, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు ఆదివారం లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలమ్మ ఆలయంలో అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో రాట్నాలమ్మ, పెదపాడు పంచాయతీ రామచంద్రపురం గ్రామంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. గుండుగొలనులోని మల్లేశ్వరస్వామి ఆలయంలో భ్రమరాంబ అమ్మవారు శ్రీగాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ కూష్మాండ మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మందలపర్రు ఉమానీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రం, పెద నింద్రకొలను తూర్పుపేట రామాలయంలో అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు.



సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి



మందలపర్రులో..



ఏలూరు దత్తాశ్రమంలో..



సుంకరవారితోటలో..



చేబ్రోలులో..



గుండుగొలనులో..



రామచంద్రపురంలో..



కైకరంలో..

పెనుగొండకు కాలినడకన పయనం



పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగి మండలం కూచింపూడి, న్యాయంపల్లి గ్రామాల భక్తులు పెనుగొండలోని వాసవీ అమ్మవారి దర్శనానికి ఆదివారం కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ సభ్యుడు కొనకళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ రెండు గ్రామాల ప్రజలు ఏటా వాసవీ అమ్మవారికి పసుపు, కుంకుమ, మిఠాయిలు తీసుకెళ్లి సమర్పిస్తారన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలు, గ్రామస్థులు పయనమయ్యారు. క్లబ్ గవర్నర్ కె.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వెండి శఠగోపం అందజేత

ఉంగుటూరు, న్యూస్‌టుడే: సీతారామపురం శివారులోని సూరమ్మ అమ్మవారికి భీమవరానికి చెందిన అల్లూరి సీతారామ రాజు, కోసూరి సురేష్ రాజులు వెండి శఠగోపం, పళ్లెం ఆదివారం అందజేశారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన గాదిరెడ్డి రమేష్, సత్యతులసి, నరేష్, యామిని దంపతులు ఆర్థిక సహకారంతో అన్నసమారాధన చేశారు. మాజీ సర్పంచి నడిమింటి నాగేశ్వరరావు, నడిమండి శ్రీను, పూడి రామకృష్ణ, నడిమింటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వెండి పూలు బహూకరణ.. భీమడోలు, న్యూస్‌టుడే: గుండుగొలనులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన భక్తుడు వగ్వాల నాగశ్రీహరి 750 గ్రాముల బరువున్న వెండి పూలను ఆదివారం అందజేశారు. వగ్వాల అచ్యుతరామయ్య, మంగపతి ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



ఈనాడు కథనానికి స్పందన

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో చేబ్రోలు- నల్లమాడు వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర రూ.3.50 కోట్లతో అభివృద్ధి చేసిన ర.భ. రహదారి ఆర్నెళ్లకే డొల్లతనం బయటపడింది. పలుచోట్ల సన్నపాటి బీటలు వచ్చి రాళ్లు లేచి గోతులు పడి అధ్వానంగా మారిన వైనంపై గత నెల 26న 'నాణ్యత డొల్ల' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై ర.భ. శాఖ జేఈ భాస్కరరావు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఏలూరు నగరానికి చెందిన యువకుడు షేక్ షారుఖ్ ఖాన్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జబీర్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు... గత నెల 30న పట్టణానికి చెందిన ఓ బాలిక ఇంటి నుంచి అదృశ్యమైంది. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. షారుఖ్ ఖాన్‌పై అనుమానం ఉన్నట్లు తల్లి చెప్పడంతో... అతని చరవాణి సంకేతాల ద్వారా కడపలో ఉన్నట్లు గుర్తించారు. నిందితుడు మాయమాటలు చెప్పి బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లిపోయి లైంగిక దాడికి పాల్పడినట్లు గుర్తించారు. దాంతో అదృశ్యం కేసును పోక్సో కేసుగా మార్పు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ఫర్నిచర్ ధ్వంసం.. ముగ్గురిపై..

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: ఓ ప్రైవేటు కళాశాలలో ఫర్నిచర్ ధ్వంసం చేశారనే ఫిర్యాదుపై ముగ్గురు విద్యార్థి సంఘం నాయకులపై ఆదివారం రాత్రి త్రీటౌన్ పోలీసుస్టేషన్లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారు వట్లూరుకు చెందిన చేబోయిన అచ్యుత్ అనే విద్యార్థి ఎన్ఆర్ పేటలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాడు. యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని మనస్తాపం చెందిన అచ్యుత్ ఈ నెల 5న కళాశాల వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ విషయం తెలిసి విద్యార్థి సంఘ నాయకులు నాగవెంకట సన్యాసిరావు, క్రాంతి కుమార్, నాగ వెంకట శివరావు కళాశాలకు వెళ్లి ఆందోళన చేశారు. ఈ క్రమంలో కళాశాలలోకి అక్రమంగా ప్రవేశించి ఫర్నిచర్ ధ్వంసం చేశారని సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోళ్ల వ్యర్థాల లారీ స్వాధీనం

పెదపాడు, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్న లారీని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు ఇన్‌ఛార్జి ఎస్సై కె.ఎస్.సతీష్ తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను మండలంలోని చేపల చెరువుల్లో మేతగా వినియోగించేందుకు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. లారీ యజమాని, డ్రైవర్, క్లీనర్లపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

విజయవాడ వరద బాధితులకు చేయూత



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి తదితరులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్ఫూర్తివంతమైన సేవలే విలువలను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆయన పిలుపు మేరకు ఫ్లాష్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు విజయవాడ వరద బాధితులకు సాయమందించేందుకు వినూత్నంగా ఆలోచన చేశారు. కలయిక, సమతా సైనిక్ దళ్, రాధారంగా మిత్ర మండలి, త్రిశూల్ యోగశాల వాలంటీర్ల ద్వారా రూ.14 లక్షల విరాళాలు సేకరించారు. ఆ సొమ్ముతో పరుపులు, గోడ గడియారాలు, దుప్పట్లు, ఇతర వస్తువులను కొనుగోలు చేశారు. ఆదివారం జూట్ మిల్లు వద్ద మన వంతు సాయం - ఫ్లీజ్ హెల్ప్ పేరిట ఆ వస్తువులను బాధితులకు అందించేందుకు లారీల్లో విజయవాడ తరలించారు. ఆ లారీలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఏలూరులోని పలు సంఘాలు, దాతల నుంచి ఇప్పటికే రూ.కోటి విలువైన వస్తువులు, సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, యర్రంశెట్టి శ్రీనివాస్, పి.సంధ్య, కె.రామ్మోహనరావు, ఎం.అను తదితరులు పాల్గొన్నారు.

గుమ్మంపై పడిపోయి వ్యక్తి మృతి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఇంట్లో తల తిరిగి గుమ్మంపై పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణపురంలో చోటు చేసుకుంది. చేబ్రోలు పోలీసుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం రావిమెట్లకు చెందిన కర్రి శ్రీనివాస రావు (52), కుమారి దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్దకుమార్తె దేవదుర్గకు నారాయణపురానికి చెందిన మణికంఠ వాసుతో వివాహమైంది. ఈ క్రమంలో ఈ నెల 5న శ్రీనివాసరావు, కుమారి దంపతులు రావిమెట్ల నుంచి నారాయణపురంలోని దేవదుర్గ ఇంటికి వచ్చారు. అదేరోజు రాత్రి శ్రీనివాసరావు మద్యం తాగారు. ఆదివారం ఉదయం టీ తాగిన తర్వాత తల తిరుగుతున్నట్లు అనిపించింది. ఇంట్లోకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు గుమ్మంపై పడిపోయారు. రక్తపు గాయాలు కావడంతో భీమడోలులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భవానీ భక్తుడికి గాయాలు.. ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొని భవానీ భక్తుడు గాయాల పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన పాలూరి దుర్గాప్రసాద్ మరికొంతమందితో కలిసి భవానీ మాల వేసుకున్నారు. వీరు ఆదివారం కనక దుర్గమ్మ గుడికి నడిచి వెళ్తుండగా వట్లూరు సీఆర్‌రెడ్డి కళాశాల సమీపంలో ద్విచక్ర వాహన చోదకుడు దుర్గాప్రసాద్‌ను ఢీకొట్టాడు. సహచరులు అతన్ని సర్వజన ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతున్నారు.



కాలువ ఇలా.. ప్రవాహం ఎలా?

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పంట కాలువలు అధ్వానంగా మారి సరిగ్గా నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పూడిక పేరుకుపోవడం, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరగడం, ఆక్రమణల కారణంగా నీటి పారుదలకు ఆటంకం కలుగుతోంది. కాలువలు బాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ ఏఈ రాము మాట్లాడుతూ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించండి: చింతమనేని

దెందులూరు న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. దెందులూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలు విషజ్వరాల బారినపడి ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దెందులూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుందర్‌బాబుకు చింతమనేని ఛారిటబుల్ ట్రస్టు తరఫున 500 రక్త పరీక్ష కిట్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. తెదేపా దెందులూరు మండల అధ్యక్షుడు మిల్లు బాబు, ఇప్పిలి వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సమస్యలపై వినతులు.. దుగ్గిరాల (పెదవేగి), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలపై ఇచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు.

వంద రోజుల పాలన అద్భుతం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన అద్భుతంగా ఉందని జనసేన పార్టీ ఏలూరు ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఏలూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖను పవన్‌కల్యాణ్ సమర్థంగా నడిపిస్తున్నారన్నారు. స్థానిక సంస్థలను రెట్టింపు ఉత్సాహంతో బలోపేతం చేస్తున్నారన్నారు. రహదారుల అభివృద్ధికి నిధులు విడుదల చేశారన్నారు. మాజీ ఉప మేయర్ శిరిపల్లి ప్రసాద్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ సేవల సలహాదారుగా శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అగ్నిమాపక శాఖ ఉమ్మడి జిల్లా ఉద్యోగుల సంఘం సలహాదారుగా జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఆదివారం సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

ఇబ్బందుల్లో గ్రామాల ప్రజలు



కొత్తముప్పర్రులో మురుగు కాలువ దుస్థితి

పెదపాడు, న్యూస్‌టుడే: పెదపాడు మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వం గత అయిదేళ్లూ పారిశుద్ధ్యాన్ని పట్టించుకోకపోవడంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థను గాలికి వదిలేసింది. కొత్త ముప్పర్రులో పలు అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారు. కానీ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షాలకే రహదారులు జలమయం అవుతుండటంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు. కొన్ని అంతర్గత రహదారులను అభివృద్ధి చేయకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వాడుక నీరు ఆవాసాల మధ్యే నిల్వ ఉంటోంది. దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు, పాలకులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పెదపాడు ఎంపీడీవో జమీల్ జామ మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దోమలు వృద్ధి చెందకుండా మందు పిచికారీ చేయిస్తామని తెలిపారు.



పెదపాడు గండిచెరువుగట్టు వద్ద ఇళ్ల ముందు ఇలా..

మౌలిక సదుపాయాలు కరవు

జగనన్న కాలనీ వాసుల పాట్లు

చాటపర్రు (ఏలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: మౌలిక సదుపాయాలు లేక జగనన్న కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు ఊళ్లు నిర్మిస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారే తప్ప కనీస సౌకర్యాలు కల్పించలేదని పలువురు వాపోతున్నారు.

చాటపర్రు పంచాయతీలో మంచినీటి చెరువు దిగువన లోతట్టు భూముల్ని జగనన్న కాలనీకి సేకరించారు. దాదాపు 600 మందికి పట్టాలిచ్చారు. ఆ భూముల్లో ఇళ్లు లేని పేదలు కొందరు గృహాలు నిర్మించుకున్నారు. కాలనీకి సరైన రహదారి సౌకర్యం లేక నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే కాలనీలోని రోడ్లు ఛిద్రంగా మారుతుండటంతో అడుగు తీసి అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఉంది. ఇదిలా ఉంటే కాలనీ లోపలకి వెళ్లాలంటే పంట కాలువ దాటాలి. కాలువకు చిన్నపాటి సిమెంటు తూరలు వేశారు. నాణ్యత లోపమో.. మరే ఇతర కారణమో గానీ అవి శిథిలం కావడంతో కాలనీ లోపలికి వెళ్లడం కష్టమవుతోంది. కాలనీ వాసులు తమ వాహనాలను చెరువు గట్టుపైనే ఉంచుతున్నారు. గ్యాస్ బండలు వస్తే వాటిని భుజాన వేసుకుని అధ్వాన రోడ్లపై తీసుకెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాలనీలో అధ్వానంగా రహదారి



పంట కాలువపై ఇలా..

పునాదుల్లోనే ఇళ్లు

రహదారి సౌకర్యం సరిగా లేక కాలనీలో కొన్ని ఇళ్లు పునాదుల్లోనే నిలిచిపోయాయి. మరికొందరు నిర్మాణాలు ప్రారంభించలేదు. పంట కాలువకు అప్పట్లో వంతెన నిర్మించలేదు. గత ప్రభుత్వం వంతెన నిర్మాణానికి సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. వంతెన, రోడ్లు నిర్మించకపోవడంతో కాలనీవాసులు ఇక్కట్లు పడుతున్నారు. పంట కాలువపై వంతెన నిర్మించాలని, కనీస సదుపాయాలు కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా తమ గోడు పట్టించుకునే వారే లేరని కాలనీ వాసులు వాపోతున్నారు.

పోలవరం

•పోలవరం •చింతలపూడి

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



దెందులూరు ఎమ్మెల్యేతో తెదేపా నాయకులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదివారం జంగారెడ్డిగూడెం వచ్చారు. పట్టణానికి చెందిన బేతిరెడ్డి నాగేశ్వరరెడ్డి ఇంటికి వెళ్లి కాసేపు కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఆయన్ను తెదేపా పట్టణాధ్యక్షుడు రావూరి, నాయకుడు పరిమి సత్యనారాయణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని చింతమనేని వారికి సూచించారు.

రేపట్నుంచి వార్డు సభ్యులకు శిక్షణ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో సాధారణ పరిపాలన విధానం, పంచాయతీరాజ్ చట్టం ముఖ్య నిబంధనలు తదితర పది అంశాలపై మంగళ, బుధవారాల్లో వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని 16 పంచాయతీలకు సంబంధించి ఎంపిక చేసిన ఇద్దరు వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు రెండ్రోజులపాటు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జరిగే శిక్షణకు మొత్తం 48 మంది సభ్యులు హాజరు కానున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



కాశీవిశ్వేశ్వరరావుకు ధ్రువపత్రం ఇస్తున్న సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.5.12 లక్షల విరాళం సమకూరింది. జంగారెడ్డిగూడెం మండలం అయ్యవారి పోలవరానికి చెందిన దోరేటి కాశీవిశ్వేశ్వరరావు రూ.1.01 లక్షలు, కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన జవ్వాది ప్రభాకరరావు రూ.2 లక్షలు ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళాలు అందించారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పెనుబల్లి సమీప వి.ఎం.బంజరకు చెందిన మిట్టపల్లి బాలాజీ రూ.లక్ష, హైదరాబాద్‌కు చెందిన డి.దుర్గ రూ.1.11 లక్షలు విరాళమిచ్చారు. దాతలను ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం అభినందించి స్వామి వారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాలు అందజేశారు.

అగ్నిమాపక శాఖ సలహాదారుగా శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అగ్నిమాపక శాఖ ఉమ్మడి జిల్లా ఉద్యోగుల సంఘం సలహాదారుగా జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఆదివారం సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా తమ్మినేని ఆనందరావు ఎన్నికయ్యారు. శ్రీనివాస్‌ను పలువురు అగ్నిమాపక సిబ్బంది, ఉద్యోగులు అభినందించారు.

నీరు నిండుగా... వ్యవసాయం పండగ!

ఇటీవల వర్షాలకు కళకళలాడుతున్న చెరువులు

24,280 ఎకరాల్లో సాగవుతున్న వరి

టి.నరసాపురం, న్యూస్‌టుడే

ఇటీవల కురిసిన వర్షాలకు మెట్ట ప్రాంతం సస్యశ్యామలమైంది. ఓవైపు భూగర్భజలాలు వృద్ధి చెందగా- మరో వైపు చెరువులు, జలాశయాలు నిండుకుండలా మారాయి. ప్రధానంగా చెరువులు జలకళ సంతరించుకోవడం ఆయకట్టు రైతులకు వరంగా మారింది. ఏటా సాగునీటి ఎద్దడితో సతమతమయ్యే వారు... ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు సాంత్వన పొందారు. నియోజకవర్గ వ్యాప్తంగా జలాశయాలు, చెరువులు, బోర్ల కింద విస్తారంగా వరి పండిస్తున్నారు.



వెలగపాడు అక్కమ్మ చెరువు కింద సాగవుతున్న వరి



జలకళ సంతరించుకున్న తిరుమలదేవిపేట చెరువు

3 జలాశయాలు... 303 చెరువులు

పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మొత్తం మూడు జలాశయాలు, 303 చెరువులు, సుమారు 1,500కి పైగా బోర్లున్నాయి. వాటి కింద 10,732 మంది రైతులు 24,280 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పోలవరం మండలంలో అధికంగా 6,590 ఎకరాల్లో వరి పండిస్తుండగా- కుక్కునూరు మండలంలో అత్యల్పంగా 868 ఎకరాల్లో మాత్రమే వరి సాగవుతోంది. టి.నరసాపురం మండలంలో అత్యధికంగా 88 చెరువులుండగా- వేలేరుపాడులో అత్యల్పంగా 12 చెరువుల కింద వరి పండుతోంది. ఏడు మండలాల్లోనూ ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు వరి సాగుతో నేలకు పచ్చరంగు వేసినట్లు కనువిందు చేస్తోంది.

చెరువుల కింద సాగవుతున్న వరి విస్తీర్ణమిలా...

మండలం	చెరువులు	రైతులు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
టి.నరసాపురం	88	1,251	2,400
కొయ్యలగూడెం	64	2,558	6,585
బుట్టాయిగూడెం	60	1,765	3,561
పోలవరం	24	3,113	6,590
జీలుగుమిల్లి	39	1,071	3,021
కుక్కునూరు	16	444	868
వేలేరుపాడు	12	530	1,255

ఆశాజనకంగా పంటలు

ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిశాయి. చెరువులు, జలాశయాలు పూర్తిగా నిండాయి. వరి పంటకు అవసరమైన మేర నీటి మట్టం ఉంది. వాతావరణం అనుకూలించడంతో రైతులు మంచి దిగుబడులు పొందే అవకాశముంది.

\- డి.ముత్యాలరావు, ఏవో, బుట్టాయాయిగూడెం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: ఎన్‌వీఎన్ కాలనీలోని ప్రధాన రహదారి పక్కనున్న చేతిపంపు చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. అక్కడే కుళాయి ఉండటంతో... నీరు పట్టుకునేందుకు ఇబ్బందిగా ఉంటోంది. అధికారులు స్పందించి కుళాయి, చేతిపంపు చుట్టూ శుభ్రం చేయించాలి. **- కిశోర్‌కుమార్, స్థానికుడు**

సమాధానం: కుళాయి, చేతిపంపు చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగింపజేస్తాం. స్థానికులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. **- పావని, కమిషనర్, చింతలపూడి**

ఊరచెరువులో పరదాల చాటున కట్టడం

నిలిపివేయించిన పురపాలక అధికారులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఊరచెరువులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ భవన నిర్మాణాన్ని నిలిపివేయించినట్లు కమిషనర్ కె.వి.రమణ తెలిపారు. ఆదివారం ఆయన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నూతనంగా ఏర్పాటు చేస్తున్న భవనం బయటకు కనిపించకుండా రహదారి వైపు పరదాలు అడ్డు పెట్టారన్నారు. ఈ పనులను పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది గుర్తించి తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దాంతో వెంటనే పనులను అడ్డుకున్నామన్నారు. సదరు యజమాని రాత్రివేళ పనులు చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, మరోమారు నిర్మాణం కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అ'పూర్వ' సమ్మేళనం.. ఆనంద నందనం!

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1997లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకొని ఆనందంగా గడిపారు. తొలుత వివిధ ఘటనల్లో మృతి చెందిన మిత్రుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల అభివృద్ధిలో భాగం కావాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పమిడి అనిల్, వందనపు రామకృష్ణ, జాలా శ్రీను, సోమన నాగేశ్వరరావు, పళ్ళెంల, మంటా సత్యలత, జి.టి.గంగాధర్, పాలా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

వెళ్లేవారే... వచ్చేవారేరి?

✦ పురపాలక సంఘంలో ఉద్యోగుల కొరత ✦ బదిలీలు పూర్తయినా, భర్తీ కాని కాని పోస్టులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పురపాలక సంఘంలో ఉద్యోగుల కొరత వేధిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ బదిలీల ప్రక్రియ పూర్తయినా, ఖాళీ పోస్టులు మాత్రం భర్తీ కాలేదు. ఇక్కడ్నుంచి బదిలీపై వెళ్లేవారే కానీ, ఇక్కడికొచ్చే వారు కనిపించడం లేదు. ఫలితంగా పలు విభాగాల అధికారులు, సిబ్బంది లేకపోవడంతో... ఆ ప్రభావమంతా పాలనపై పడుతోంది. గ్రేడ్-2 పురపాలక సంఘమైనా, నగర పంచాయతీగా ఉన్నప్పుడు మంజూరైన పోస్టులే దిక్కయ్యాయి. వీటిలోనూ కొన్ని ఖాళీగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రేడ్-1 పురపాలక సంఘంగా ఉన్నతి కల్పించి... ఆ మేరకు పోస్టులు మంజూరు చేయాలని పాలక వర్గం కోరుతోంది.



జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ కార్యాలయం

మేనేజర్ నుంచి ఇన్‌స్పెక్టర్ వరకు..

పురపాలక సంఘం మేనేజర్ రమణ ఉద్యోగోన్నతిపై ఇటీవల ఇక్కడే కమిషనర్‌గా విధులు స్వీకరించారు. దీంతో మేనేజర్ పోస్టు ఖాళీ అయ్యింది. పట్టణ ప్రణాళికా విభాగంలో టీపీవో ఎం.వెంకట్రావు సుమారు 4 నెలలుగా దీర్ఘకాలిక సెలవులో ఉంటూ బదిలీపై కాకినాడ వెళ్లారు. ఈ పోస్టు భర్తీ చేయలేదు. టీపీఎస్ సత్య బాబాజీ నరసాపురం వెళ్లి రెండేళ్లు అవుతోంది. ఈ పోస్టులో కాకినాడ నుంచి చాంద్‌బీబీని ఇటీవల నియమించారు. కానీ, ఈమె చేరలేదు. ఇంజినీరింగ్ విభాగంలో ఇద్దరు ఏఈలుండగా.. ఒకరు ఏలూరు బదిలీపై వెళ్లి రెండేళ్లయినా ఎవరినీ నియమించలేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ నిడదవోలు బదిలీ అయ్యారు. ఈ పోస్టు ఖాళీయే. కీలకమైన జేఏవో పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉండగా, సీనియర్ అకౌంటెంట్ లేరు. 'పురపాలక సంఘంలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు పురపాలక పరిపాలన శాఖకు లేఖ రాస్తా' అని కమిషనర్ కె.వి.రమణ తెలిపారు.

జూద స్థావరాలపై దాడి

చింతలపూడి పట్టణం, ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: పోతునూరులో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నారు. ● దొరసానిపాడులోని జూద స్థావరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1400 స్వాధీనం చేసుకున్నారు. ● కొయ్యలగూడెంలో జూద స్థావరంపై దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,350 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడిలో అక్రమంగా నిల్వ చేసిన మందుగుండు సామగ్రిని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు. ఆయన కథనం మేరకు... కొత్త బస్టాండ్ సమీప ఓ దుకాణంలో మందుగుండు సామగ్రి నిల్వ చేసినట్లు సమాచారం అందింది. పోలీసులు దాడి చేసి రూ.15 వేలు విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఏలూరు నగరానికి చెందిన యువకుడు షేక్ షారుఖ్ ఖాన్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జబీర్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు... గత నెల 30న పట్టణానికి చెందిన ఓ బాలిక ఇంటి నుంచి అదృశ్యమైంది. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. షారుఖ్ ఖాన్‌పై అనుమానం ఉన్నట్లు తల్లి చెప్పడంతో... అతని చరవాణి సంకేతాల ద్వారా కడపలో ఉన్నట్లు నిర్ధారించారు. నిందితుడు మాయమాటలు చెప్పి బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లిపోయి లైంగిక దాడికి పాల్పడినట్లు గుర్తించారు. దాంతో అదృశ్యం కేసును పోక్సో కేసుగా మార్పు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

జయ ప్రదాయ... జగత్ ప్రియాయ!



జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ



జంగారెడ్డిగూడెం: అన్నపూర్ణా దేవిగా వాసవిమాత



కొయ్యలగూడెం గ్రామీణం: శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ



బుట్టాయగూడెం: కలశాలతో మహిళల ఊరేగింపు

చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు ఆదివారం అమ్మవార్లు లలితా త్రిపురసుందరిదేవి అలంకరణలో భక్తులకు అభయమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి... అమ్మవార్లను దర్శించుకొని తరించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి, నూకాలమ్మ, విజయదుర్గమ్మ, కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, లలితాదేవి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. గురవాయిగూడెం బ్రహ్మసూత్ర శివాలయంలో రాజరాజేశ్వరి, అయ్యప్పస్వామి ఆలయంలో జ్ఞానసరస్వతిని విశేషంగా అలంకరించారు. కొయ్యలగూడెంలోని కనకదుర్గమ్మ, బయ్యనగూడెంలోని శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ, కన్నాపురం, పొంగుటూరు తదితర ఆలయాల్లో అమ్మవార్లకు కుంకుమార్చన పూజలు చేశారు. జీలుగుమిల్లి, లింగపాలెం, కొత్తపల్లి, యడవల్లి, వేలేరుపాడు, పోలవరం, టి.నరసాపురం, బొర్రంపాలెం, కేతవరం, శ్రీరామవరం, టి.నరసాపురం ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. బుట్టాయగూడెం త్రిశక్తి పీఠం ఆధ్వర్యంలో 116 మంది మహిళలు కలశ గ్రామోత్సవం చేపట్టారు. **- న్యూస్‌టుడే బృందం**



జీలుగుమిల్లి: జగదాంబదేవి



లింగపాలెం: అలంకరణలో అమ్మవారు



పోలవరం: రామయ్యపేటలో..



టి.నరసాపురంలో..

వలకు చిక్కిన కొండచిలువ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కొవ్వాడ జలాశయంలో చేపలు పడుతుండగా.. లక్ష్మీపురానికి చెందిన రాజు వలకు ఆదివారం సాయంత్రం కొండచిలువ చిక్కింది. సుమారు అయిదడుగుల పొడవున్న కొండచిలువ... వల నుంచి బయటకు తీసిన కాసేపటికి మృతి చెందింది.

ఏటా కోత... ప్రమాదాల చెంత

పోలవరం, న్యూస్‌టుడే: ఓవైపు ఏటా గోదావరికొచ్చే వరదలు.. మరోవైపు కొండ వాగుల ఉద్ధృతికి పోలవరం మండలం పట్టిసీమ రేవు గట్టు కోతకు గురవుతోంది. ఈ కోత ప్రభుత్వ భవనాల పాలిట శాపంగా మారింది. నదీ తీరంలో కోతల నివారణకు రక్షణ గోడ నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేయాలని జల వనరుల శాఖాధికారులు ఏటా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా, అవి కాస్త బుట్టదాఖలవుతున్నాయి. నష్ట నివారణ చర్యలు తీసుకోకుంటే ప్రభుత్వ భవనాలు నేలమట్టమయ్యే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గ్రామ సచివాలయం సమీపంలో కోతకు గురైన గట్టు

పంచాయతీ భవనాన్ని తాకి..

పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి ఉద్ధృతంగా ప్రవహించి వచ్చి గోదావరిలో కలిసే కొండ వాగులు నేరుగా గట్టును తాకుతున్నాయి. మరోవైపు నెలల తరబడి గోదావరికొచ్చే వరదలతో గట్టు కోత క్రమంగా పెరిగి పంచాయతీ భవనాన్ని తాకింది. ఈ భవనం ఎప్పుడు గోదావరిలో కలిసిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రక్షణ గోడ నిర్మిస్తేనే...

అవుట్‌ఫాల్ స్లూయిజ్ ఎదురుగా లంక పెరిగిపోవడంతో వాగుల ప్రవాహం ఎడమ వైపు గేట్ల ద్వారా వెళ్లి బలంగా గట్టును తాకుతోంది. దాంతో గ్రోయిన్లు దెబ్బతిన్నాయి. గట్టు కోత నివారణకు కొంత మేర కాంక్రీట్ వాల్ నిర్మించడం, ఎదురుగా ఉన్న మట్టి తొలగించడానికి రూ.1.29 కోట్లతో ప్రతిపాదనలు గతంలోనే ప్రభుత్వానికి పంపాం. **- రాహుల్, పర్యవేక్షణ ఏఈ**

హమ్మయ్య.. రోడ్లు వేస్తున్నారు!

నరసన్నపాలెం నుంచి రామానుజపురం, వేదాంతపురం మీదుగా ధర్మారావుపేట వరకున్న ప్రధాన రహదారి పునర్నిర్మాణం ఎట్టకేలకు మొదలైంది. వైకాపా హయాంలో రోడ్డు అభివృద్ధికి నాబార్డు రూ.310 లక్షలు మంజూరు చేయగా- గుత్తేదారుకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించలేదు. ఫలితంగా పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక... బకాయిలు చెల్లించడంతో పనులు మళ్లీ మొదలయ్యాయి. 6.8 కిలోమీటర్ల మార్గంలో... ఇప్పటి వరకు 4.4 కి.మీ. మేర బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయినట్లు పంచాయతీరాజ్(ప్రత్యేక రహదారులు) ఏఈ అంకిరెడ్డి తెలిపారు. **- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ**



ఆయుష్ వైద్య శిబిరానికి స్పందన

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: దొరమామిడిలో రాజమహేంద్రవరానికి చెందిన గంగా ఆసుపత్రి ఆధ్వర్యాన ఆదివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు పీవీవీ చైతన్య, కొల్లా వెంకటేశ్, బోడా రవికిరణ్ హాజరై రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 150 మంది వైద్య సేవలు పొందారని నిర్వాహకులు తెలిపారు.

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తిమ్మాపురంలో ఏలూరు ఆయుష్ ఆసుపత్రి ఆధ్వర్యాన ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేసినట్లు వైద్యుడు ప్రవీణ్ తెలిపారు.

అనారోగ్య బాధితునికి బొరగం పరామర్శ

పోలవరం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న అనిశెట్టి రాంబాబును రాష్ట్ర ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆదివారం పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వారికి సూచించారు. అలాగే వార్డులోని పలువురు రోగులను పలకరించి వైద్య సేవలపై ఆరా తీశారు.

కాలం చెల్లిన బస్సులు.. గమ్యం చేరని ప్రజలు

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ఏలూరు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి చింతలపూడికొచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసులు మార్గం మధ్యలో మొరాయిస్తున్నాయి. గమ్యం చేరకుండానే బస్సులు నిలిచిపోతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతలపూడి మండలంలోని గ్రామీణ రోడ్లతో పాటు ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. ఏ దారి చూసినా, గుంతలమయంగా తయారవడంతో... బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆగిపోతున్నాయి. ఇటీవల కాలంలో సమస్య మరింత జటిలమైంది. దాంతో ఆర్టీసీ బస్సు ఎక్కాలంటేనే ప్రయాణికులు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన దుస్థితి. దీనికితోడు కాలం చెల్లిన బస్సులు ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. అధ్వాన రహదారుల కారణంగా బస్సు చక్రాలు విరిగిపోవడం, టైర్లు పంక్చర్ కావడం, కమాన్ కట్లు, సీట్లు ఊడిపోవడం తదితర సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు, ఆటోలు తిప్పడం ఆపేశారు. ఫలితంగా చింతలపూడి నుంచి చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లాలంటే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దాంతో విద్యార్థులు సమయానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేక పోతున్నారు.



యర్రగుంటపల్లిలో ఆగిపోయిన బస్సు

అధ్వాన దారులతోనే...

చింతలపూడికొచ్చే ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఈ కారణంగానే బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రహదారులు బాగున్న ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో సమస్యలు తలెత్తడం లేదు. చింతలపూడికి వెళ్లే రోడ్లను బాగు చేసిన వెంటనే ఆయా మార్గాల్లో అదనపు సర్వీసులు నడుపుతాం. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

- గంగాధర్, ఆర్టీసీ డిపో మేనేజర్, జంగారెడ్డిగూడెం

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

పాత నేరస్థులపై నిఘా



అవగాహన కల్పిస్తున్న శుభశేఖర్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె.శుభశేఖర్ హెచ్చరించారు. ఆగిరిపల్లి పోలీసుస్టేషన్లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు, అనుమానితులు, పాత నేరస్థులపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి నడుచుకోవాలని, వివాదాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.5.12 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.5.12 లక్షల విరాళం సమకూరింది. జంగారెడ్డిగూడెం మండలం అయ్యవారి పోలవరానికి చెందిన దోరేటి కాశీవిశ్వేశ్వరరావు రూ.1.01 లక్షలు, కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన జవ్వాది ప్రభాకరరావు రూ.2 లక్షలు ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళాలు అందించారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పెనుబల్లి సమీప వి.ఎం.బంజరకు చెందిన మిట్టపల్లి బాలాజీ రూ.లక్ష, హైదరాబాద్‌కు చెందిన డి.దుర్గ రూ.1.11 లక్షలు విరాళమిచ్చారు. దాతలను ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాలు అందజేశారు.

నేటి నుంచి శిక్షణ కార్యక్రమం

నూజివీడు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలు, పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం ఈనెల 7 నుంచి 10 వరకు నూజివీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో సి.రాఘవేంద్రనాథ్ తెలిపారు.

అగ్నిమాపక శాఖ సేవల సలహాదారుగా శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అగ్నిమాపక శాఖ ఉమ్మడి జిల్లా ఉద్యోగుల సంఘం సలహాదారుగా జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఆదివారం సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పెనుగొండకు కాలినడకన పయనం

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగి మండలం కూచింపూడి, న్యాయంపల్లి గ్రామాల భక్తులు పెనుగొండలోని వాసవీ అమ్మవారి దర్శనానికి ఆదివారం కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ సభ్యుడు కొనకళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ రెండు గ్రామాల ప్రజలు ఏటా వాసవీ అమ్మవారికి పసుపు, కుంకుమ, మిఠాయిలు తీసుకెళ్లి సమర్పిస్తున్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలు, గ్రామస్థులు పయనమయ్యారు.

జూద స్థావరంపై దాడి

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరులో జూద స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,200 స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై నాగభూషణం తెలిపారు.

సినిమా

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	స్వాగ్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	దక్షిణ
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	దేవర
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	స్వాగ్
శ్రీవెంకటరమణ సినిమాస్	దక్షిణ
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

వరద మిగిల్చిన నష్టం!

✷ అధ్వానంగా లంక గ్రామాల రోడ్లు ✷ గండ్లు పడి రాకపోకలకు అంతరాయం

కైకలూరు, న్యూస్‌టుడే

కొన్ని రోజుల ముందు కొల్లేరుకు వచ్చిన భారీ వరద అపార నష్టాన్ని మిగిల్చింది. కొల్లేరు లంక గ్రామాలను ముంపు నీరు చుట్టుముట్టడంతో గ్రామాల మధ్య రాకపోకలు సాగించలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం వరద ఉద్ధృతి పూర్తిగా తగ్గినా కొల్లేరు లంక గ్రామాలకు అనుసంధానంగా ఏర్పాటు చేసుకున్న రోడ్డు మార్గాలు దారుణంగా దర్శనమిస్తున్నాయి.



గోకర్ణపురం వద్ద ఇలా..

ఇదీ పరిస్థితి

కైకలూరు మండలం శృంగవరప్పాడు పంచాయతీ పరిధిలోని గోకర్ణపురం నుంచి దెందులూరు నియోజకవర్గంలోని పైడిచింతపాడు చేరుకునే ప్రధాన మార్గం దారుణంగా మారింది. ఇరువైపులా కొల్లేరు సరస్సు మధ్యన రోడ్డు మార్గం ఉండటంతో సుమారు 20 రోజుల పాటు ముంపులోనే కొనసాగింది. నీటి ఉద్ధృతికి రోడ్డుకు మూడు చోట్ల గండ్లు పడి పూర్తిగా కొట్టుకుపోయింది. కైకలూరు మండలంలోని 12 కొల్లేరు లంక గ్రామాలతో పాటు సమీప గ్రామస్థులు ఏలూరు చేరుకునేందుకు ఇదే ప్రధాన మార్గం. ప్రస్తుతం చుట్టూ తిరిగి ఏలూరు చేరుకునేందుకు ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఇక రోడ్డు ఏర్పాటుకు అటవీశాఖ అనుమతులు తప్పనిసరి కావడంతో కనీస మరమ్మతులకు ఏళ్లు పడుతున్న తరుణంలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మాణం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొల్లేరు నాయకులు కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి రోడ్ల దుస్థితి తెలిపి వినతిపత్రం అందించారు. కలెక్టర్ సుముఖత చూపడంతో త్వరలోనే రోడ్డు ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తారని కొల్లేరు వాసులు ఆకాంక్షిస్తున్నారు.



గండ్లు పడిన పైడిచింతపాడు ప్రధాన మార్గం

అమ్మవారి భక్తులకూ ఆటంకమే

కైకలూరు మండలం కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ అమ్మవారు ఉమ్మడి జిల్లా ప్రజలకు ఆరాధ్యదైవం. ఈ క్రమంలో ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల నుంచి ప్రతి ఆదివారం భారీ సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. అయితే పై మూడు నియోజకవర్గాల ప్రజలు అమ్మవారి సన్నిధి చేరుకునేందుకు ఇదే ఏకైక మార్గం. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు రాలేని స్థితి నెలకొనడంతో భక్తులు పడరాని పాట్లు పడుతున్నారు. ఏలూరు మీదుగా కైకలూరు నుంచి.. గణపవరం, ఉండి, ఆకివీడు మార్గాల్లో దేవస్థానానికి అతికష్టం మీద చేరుకుంటున్నారు. ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టి అమ్మవారి దర్శనానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు పట్టణం సిద్ధార్థ కళాశాల సమీపంలో చెత్త ఎక్కువగా ఉండటంతో దుర్వాసన వస్తోంది. **- రాజేశ్, నూజివీడు**

సమాధానం: చెత్త తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం. **- నాగరాజు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూజివీడు**

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: కైకలూరు వెలమపేట ఎంపీపీ పాఠశాల సమీపంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగు రోజుల తరబడి రోడ్డుపైనే ఉంటుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- ప్రసాద్, వెలమపేట**

సమాధానం: వెంటనే డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరిచి మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపడతాం. **- వెంకటేశ్వరరావు, పంచాయతీ ఈవో, కైకలూరు**

చాట్రాయి, న్యూస్‌టుడే

సమస్య: నరసాపురం, చిన్నంపేట, నరసింహారావుపాలెం మార్గంలో ఇటీవల వర్షాలకు వరద రహదారి మీదుగా ప్రవహించి రాళ్లు లేచిపోయి, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. **- గార్లపాటి మారేశ్, సి.గుడిపాడు**

సమాధానం: ఇటీవల రోడ్డును పరిశీలించాం. త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం. **- సీహెచ్.బాబూరావు, డీఈ, ర.భ.శాఖ, నూజివీడు**

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: చెక్కపల్లి సెంటర్ నుంచి లోపూడి వైపు వెళ్లే రహదారికి ఇరువైపులా చెత్త, వ్యర్థాలు అధికమవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలి. **- ఎం.సురేశ్, స్థానికుడు**

సమాధానం: గ్రామంలో ఉన్న చెత్తను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- సుజాత, పంచాయతీ కార్యదర్శి**

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే

సమస్య: ఆగిరిపల్లి బీసీ కాలనీలో వీధి దీపం కొద్ది రోజులుగా వెలగడం లేదు. రాత్రి వేళలో అటుగా వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోంది. **- శ్రీరాములు, ఆగిరిపల్లి**

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- బొల్లినేని ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి**

సేవ చేయడం అభినందనీయం: కామినేని



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

కైకలూరు, న్యూస్‌టుడే: ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఓం నమస్తుతే క్షేత్రం కైకలూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక తాలూకా కూడలిలో ఎన్జీవోస్ కార్యాలయంలో ఆదివారం కైకలూరు, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు కంటి వైద్య నిపుణులైన ప్రశాంతి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచిత కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. 200 మంది రోగులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంప్రదాయ కళల పరిరక్షణకు మేము సైతం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సంప్రదాయ కళల పరిరక్షణలో మేము సైతం అంటూ శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం, నాట్యగురు మేదరమెట్ల శిరీష నేతృత్వంలో మన దేవాలయం మన కూచిపూడి కార్యక్రమాన్ని దొండపాడులోని శ్రీ నం దత్తాశ్రమంలో ఆదివారం నిర్వహించారు. ఏలూరులోని ప్రముఖ ఆలయాలతో పాటు దేశంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో తమ శిష్యులు నాట్య ప్రదర్శనలు ఇస్తారని శిరీష తెలిపారు. ప్రజల్లో దేవాలయాలపై భక్తి, కూచిపూడి నాట్యంపై అనురక్తిని కల్పించి సంప్రదాయ కళలను పరిరక్షించడమే కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు.

సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు: డీఎస్పీ



మాట్లాడుతున్న ప్రసాద్

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో సైబర్ నేరాలు, గంజాయి నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నూజివీడు డీఎస్పీ కె.వి.ఎన్.వి.ప్రసాద్ స్పష్టం చేశారు. నూజివీడు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సబ్ డివిజన్‌లోని పరిస్థితులను సమీక్షిస్తున్నామన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్లు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని, వాటిపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ, ప్రజల ఆలోచనల్లో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. సైబర్ మోసం జరిగితే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. గంజాయి మత్తు ప్రణాళికతో కట్టడి చేస్తామన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభ



ప్రసంగిస్తున్న ప్రదీప్

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లిలోని పెరికెగూడెం గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై కొన్ని రోజుల కిందట అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. ఆదివారం స్థానిక గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఉపాధి హామీ జిల్లా రిసోర్స్ అధికారి ప్రదీప్ ఆధ్వర్యంలో 2023-24 ఏడాదిలో జరిగిన ఉపాధి పనులపై గ్రామ సభ నిర్వహించి వివరాలు తెలియజేశారు. ఈనెల 9న మండల స్థాయిలో సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు తెలియజేస్తామని ఎంటీఏ నరేశ్ తెలిపారు. సర్పంచి పెరుమాళ్ల పద్మ, ఉప సర్పంచి తోకల నాగబాబు, కూటమి నాయకులు ఎ.రాంబాబు, పి.ఏడుకొండలు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు చాట్రాయి మండల సమావేశం

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి మండల పరిషత్తు సమావేశం సోమవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు జి.రాణి తెలిపారు. సమావేశానికి ఎంపీపీ లంక నిర్మల అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు విధిగా సమావేశానికి తమ శాఖల పనితీరు ప్రణాళికలతో రావాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి

నూజివీడు, న్యూస్‌టుడే: రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్.రామ్మోహన్‌రావు, వి.సంజీవరెడ్డి అన్నారు. నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం నూజివీడులో నియోజకవర్గ బాధ్యుడు మరీదు కృష్ణ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నాయకులు బి.డి.రవికుమార్, పరిమి సాగర్‌కుమార్, పి.ప్రసాద్, సూర్య దేవర ప్రసాద్, ఆంజనేయులు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



చాట్రాయి, న్యూస్‌టుడే: ఎగుమతులకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని చాట్రాయిలో శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నామని పీడీఎస్ ఉప తహసీల్దారు జి.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన సవిరి బసవయ్య ఇంట్లో బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. 16 క్వింటాళ్ల బియ్యం రెవెన్యూ కార్యదర్శి సత్యనారాయణ సమక్షంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. 6-ఎ కేసు నమోదు చేశామన్నారు.

బాణసంచా దుకాణాలపై దాడులు



ముదినేపల్లి, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ ఉంచినా, తయారు చేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై వెంకటకుమార్ హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముదినేపల్లిలో దుకాణాలపై దాడులు నిర్వహించారు. గురజ రహదారిలో కంచర్ల శ్రీనివాసరావు దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.45 వేల విలువైన బాణసంచా పట్టుకున్నారు. శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం'

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో పల్లె పల్లెకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటం తీసుకు వెళ్తామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు భూపతి రవీంద్ర అన్నారు. ముదినేపల్లి నుంచి ఆదివారం గుడివాడలో నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ పోరాట సదస్సుకు ఆయన ఆధ్వర్యంలో ఎస్సీ నాయకులతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు మరింత తీవ్రం చేస్తామన్నారు. అనంతరం మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేశ్‌ను కలిసి బుద్ధుని ప్రతిమ అందించారు. మండలాధ్యక్షుడు పాగోలు విజయ్‌సాగర్, మొవ్వా ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం.. ప్రజల్లో వ్యాధుల భయం

మురుగు కాలువల్లేక తప్పని ఇబ్బందులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: దోమలు, దుర్వాసన, వ్యాధులు బారిన పడతామేమోనన్న భయంతో పెయ్యేరు శివారు వైఎస్సార్ కాలనీ వాసులు అల్లాడుతున్నారు. సుమారు 150 కుటుంబాలు నివసించే ఈ కాలనీకి మురుగు పెద్ద సమస్యగా మారింది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో మురుగు రహదారులపై పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంత ఎండలు కాసినా రహదారులు మాత్రం మురుగు నీటితో దర్శనమిస్తున్నాయి. దోమలు, ఈగలు చేరి పారిశుద్ధ్య సమస్య తలెత్తుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రహదారిపై నిలిచిన మురుగు నీరు



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు (పాత చిత్రం)

నిరాహార దీక్షలు చేసినా..

మురుగు కాలువల నిర్మాణానికి నిధులు వచ్చినా.. ఆ నీటి మళ్లింపుపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ప్రత్యామ్నాయ, పరిష్కార మార్గం చూడకుండా ఆ నిధులతో గ్రామంలో మరో పనులు నిర్వహించారు. దీంతో తమ మురుగు సమస్య పరిష్కరించాలని గత ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది మార్చిలో సుమారు వారం రోజుల పాటు వైఎస్సార్ కాలనీ వాసులు నిరాహార దీక్షలు నిర్వహించారు. అయినా గత వైకాపా ప్రభుత్వం స్పందించలేదు. దీంతో నేటికీ ఆ సమస్య అలానే ఉంది. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు. కాలనీకి ఎదురుగా ఉన్న రెండు కాలువల్లో ఒకటి పూర్తిగా వాడుకలో లేదని, దానిని పలువురు ఆక్రమించుకున్నారని, వినియోగంలోకి తీసుకొస్తే రైతులకు ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కారమవుతుందని కాలనీ వాసులు చెబుతున్నారు.

పరిశీలించి.. పరిష్కరిస్తాం..

ప్రస్తుతం మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపడతాం. అలాగే శాశ్వతంగా మురుగు సమస్య పరిష్కారానికి పరిశీలించి, వారితో చర్చించి ప్రణాళిక సిద్ధం చేస్తాం. మురుగు జాతీయ రహదారి దాటించేలా ఏర్పాట్లకు ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడతాం. **- రమేశ్, పంచాయతీ కార్యదర్శి**

నాలుగు కిలోల గంజాయి పట్టివేత ఏడుగురి అరెస్టు

పెదకాకాని, న్యూస్‌టుడే: యువతకు గంజాయి అమ్మి సొమ్ము చేసుకుంటున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరుకు చెందిన ప్రైవేటు ఉద్యోగి వాసా రాజేష్, ట్రాక్టర్ డ్రైవర్ తాడిబోయిన గోపికృష్ణ, కూల్‌డ్రింక్ దుకాణం నిర్వాహకుడు దుగ్గపు పవన్‌కుమార్ స్నేహితులు. ఈ ముగ్గురు జల్సాలకు అలవాటు పడి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నారు. వీరికి గంజాయి వ్యాపారం చేసే అనగాని రాఘవేంద్ర (కృష్ణా జిల్లా ఉయ్యూరు), తాతా హేమంత్ (ఏలూరు జిల్లా నూజివీడు), విజయవాడ పడమటకు చెందిన పండాలనేని వెంకట శివగణేశ్‌కుమార్, ప్రతివాడ శివాజీ తోడయ్యారు. ఈ నెల 5న రాత్రి వీరు గంజాయి తీసుకొచ్చి నంబూరులోని ఓ కాలనీ వద్ద ఉన్న రాజేష్, గోపికృష్ణ, పవన్‌కుమార్‌లకు ఇచ్చారు. అందరూ కలిసి గంజాయిని చిన్న పొట్లాలుగా కడుతుండగా.. అదే సమయంలో పెదకాకాని సీఐ నారాయణస్వామి, కానిస్టేబుళ్లు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి (విలువ రూ.60 వేలు), మూడు ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ కృష్ణకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితులను ఆదివారం రిమాండ్‌కి పంపినట్లు సీఐ తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు మండలం వెంకటాద్రిపురంలో కారు అదుపు తప్పి మురుగు కాలువలోకి దూసుకెళ్లిన ఘటన ఆదివారం జరిగింది. ప్రమాద సమయంలో కారులో అయిదుగురు ఉన్నారు. వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల సాయంతో కారును బయటకు తీశారు.

లారీని ఢీ కొట్టిన కారు.. నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు మండలం మొర్సపూడి చెరువు దగ్గర ఆదివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని బెలూన్స్ తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బడుల్లో అసాంఘిక కార్యకలాపాలు

సెలవు రోజుల్లో పేట్రేగిపోతున్న ఆకతాయిలు

అడవినెక్కలం (ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: దేవాలయాలుగా భావించాల్సిన పాఠశాలలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. సెలవు రోజుల్లో పాఠశాలలను అడ్డాలుగా చేసుకుని వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం దసరా సెలవుల నేపథ్యంలో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడితే పునఃప్రారంభం నాటికి విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడాల్సి వస్తోంది.



ప్రహరీ లేని అడవినెక్కలం ఉన్నత పాఠశాల

సమస్య ఇక్కడే..

మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సెలవుల రోజుల్లో పర్యవేక్షణ కొరవడటంతో ఆకతాయిలు ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారు. ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీరు పైపులైన్లు గతంలో ధ్వంసం చేశారు. గదుల తలుపులు విరగొట్టారు. వరండాలోని ఫ్యాన్లు ధ్వంసం చేశారు.

● ఈదర జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆకతాయిలు జూదం ఆడుతున్నారు. మద్యం తాగి సీసాలు అక్కడే పడేస్తున్నారు. అడవినెక్కలం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ఈదులగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల, సూరవరం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సైతం అదే పరిస్థితి దర్శనమిస్తోంది. పాఠశాల తరగతి గదుల బయట, తరగతి గదుల్లో తాగి పడేసిన మందు సీసాలు, సిగరెట్లు కనిపిస్తున్నాయి.



ఈదర జడ్పీ పాఠశాలలో మద్యం సీసాలు

కొరవడిన పర్యవేక్షణ..

మండల పరిధిలోని 5 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు మాత్రమే వాచ్‌మెన్ పోస్టు ఉంది. మిగిలిన నాలుగు పాఠశాలలకు వాచ్‌మెన్ పోస్టులు లేవు. దీంతో పర్యవేక్షణ లేకపోవడంతో ఆకతాయిల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. పలు పాఠశాలలకు ప్రహరీలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాఠశాలల సమస్యలపై దృష్టి పెట్టి ఆకతాయిల ఆగడాలు కట్టడి చేయాలని స్థానికులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో సెలవు రోజుల్లో ఆకతాయిల ఆగడాలు కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటాం.' అని ఎంఈవోలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్ కుమార్ తెలిపారు.

మనోహరం.. అమ్మ అలంకారం



కైకలూరు: దర్శనానికి బారులుదీరిన భక్తులు

న్యూస్‌టుడే, బృందం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కైకలూరు శ్యామలాంబ, వాసవీ కన్యాక పరమేశ్వరి అమ్మవార్లను రాజరాజేశ్వరీదేవీగా అలంకరించారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. ముసునూరులో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ లలితా త్రిపుర సుందరీదేవిగా, బలివేలో రాజరాజేశ్వరీదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. నూజివీడు పట్టణంలోని కోట మహిషాసురమర్దని అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. మహా చండీ యాగం నిర్వహించారు. దేవపూడి హిమగిరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు, అల్లూరులో రేణుకా ఎల్లమ్మ, వణుదుర్రులో వీర అంకమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా, గురజలో పార్వతీదేవి గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి సమీపంలోని కనకదుర్గమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఆగిరిపల్లిలోని యాదవుల మండపం దగ్గర అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



బలివే: రాజరాజేశ్వరీదేవి



నూజివీడు: అన్నపూర్ణాదేవిగా..



గురజ: గాయత్రీదేవి



పోలవరంలో..

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

మండవల్లి, కలిదిండి, న్యూస్‌టుడే: మండవల్లి కాశీ అన్నపూర్ణాదేవి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. లోకుమూడి దత్తాశ్రమంలో అమ్మవారు గాయత్రీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ✦ కోరుకొల్లు పాలెం రోడ్డులోని రాజరాజేశ్వరీదేవి, మందబయలు కాలనీలో వరసిద్ధి వినాయకుని ఆలయంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు.



ఆగిరిపల్లి: లలితా త్రిపుర సుందరీదేవిగా

'రాహుల్‌ను విమర్శించే స్థాయి పవన్‌కు లేదు'

నూజివీడు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ యువ నేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్ కుమార్ అన్నారు. నూజివీడులో ఆయన ఆదివారం మాట్లాడుతూ.. అన్ని కులాలు, మతాల ఓట్లతో గెలుపొందిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు హఠాత్తుగా హిందూయిజం ఎందుకు గుర్తొచ్చిందని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.